Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.8

June 2024



## ప్లానింగ్ ప్రాధాన్యత

ఎడిటోరియల్

# బైబిల్ నిరక్షరాస్యత

లైఫ్‌వే మినిస్ట్రీస్ వాళ్ళు అమెరికాలోని, వివిధ రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా చర్చ్‌లకు వెళ్ళే 1000 మంది ప్రొటెస్టెంట్స్ మీద ఒక సర్వే చేశారు. వారిలో 45% మంది తమ బైబిల్స్‌ని వారానికి ఒకటికంటే ఎక్కువసార్లు చదువుతామని, 40% మంది అప్పుడప్పుడు అంటే నెలకు ఒకటి లేదా రెండు సార్లు చదువుతామని, మిగిలినవారు చర్చ్‌కి హాజరైనా బైబిల్‌ను ఎప్పుడూ చదవమని చెప్పారు. బైబిల్ చదవడానికే సమయం లేకపోతే, ఇష్టపడకపోతే, ఆచరణ గురించి ఆలోచించడం అనవసరం. ఆధునీకరణ, టెక్నాలజీలో ప్రపంచంతో పోటీపడుతున్నా బైబిల్ పరంగా 'నిరక్షరాస్యులుగా' మారుతున్నారని బైబిల్ పండితుల అభిప్రాయం.

బైబిల్ నిరక్షరాస్యత అంటే ఏంటి? బైబిల్‌ని క్రమంగా రోజూ చదవకపోవడం, సరైన విధానంలో అర్థం చేసుకోకపోవడం, కంఠస్థం చేయకపోవడం, లోతుగా ధ్యానించకపోవడం. నేర్చుకొన్న వాక్యం జీవితానికి అన్వయించు కోకపోవడం. బైబిల్ నిరక్షరాస్యత కేవలం అమెరికాలాంటి దేశాల్లోనే కాదు, మన దేశంలోని సంఘాల్లో కూడా ఎక్కువగానే ఉంది. బైబిల్ మొత్తాన్ని ఒక్కసారి కూడా చదవని వారు, ప్రతిదినం చదవని వారు, బైబిల్లోని పుస్తకాలు, వాటిలోని సారాంశం గురించి తెలియనివారు, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు బైబిల్ ఏమి సమాధానం చెబుతుందో తెలియని వారు, యేసుక్రీస్తు జీవితం గూర్చి, ప్రాథమిక బైబిల్ సిద్ధాంతాలైన దేవుడు, మానవుడు, రక్షణ, నీతిమంతునిగా తీర్చబడడం, మొదలగు వాటి గురించి అవగాహన లేని విశ్వాసులు కోకొల్లలు గా ఉంటున్నారు. వీటిని నేర్పడం, ఆత్మీయంగా ఎదిగేటట్లు చేయడం కన్నా, చర్చ్‌కి క్రమంగా వస్తే చాలు అన్నట్లు ఉంటుంది నేటి సేవకుల ధోరణి.

బైబిల్ నిరక్షరాస్యత వల్ల విశ్వాసుల జీవితాల్లో అనేక దుష్ఫలితాల్ని చవిచూస్తున్నాము. చర్చ్‌లకు వెళ్తున్నా సంపూర్ణంగా దేవుని, ఆయన వాక్యాన్ని నమ్మలేక ఆచారాలు, మూఢనమ్మకాలు, ముహూర్తాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జీవితంలో ఎదురయ్యే శ్రమలు, కష్టాల్లో దేవుని కొరకు నిలబడలేని స్థితి ఉంటుంది. తప్పుడు బోధకుల ను, పేరు ప్రఖ్యాతులు కలిగిన వారిని నమ్ముతూ వారు చెప్పిందే సత్యంగా భావిస్తున్నారు. నిస్సారమైన క్రైస్తవ జీవితాన్ని జీవిస్తూ, దేవుని పనిని నిర్లక్ష్యం చేస్తున్నారు. బైబిల్ నిరక్షరాస్యత వల్ల "ఆత్మీయ మరుగుజ్జులతో నిండిన సంఘాలు నేడు మనం కలిగి ఉన్నామని, వీటిలో నుంచే ఆత్మీయ మరుగుజ్జులు సంఘ నాయకులుగా, పాస్టర్స్‌గా, పెద్దలుగా మారుతున్నారని" ఆపరేషన్ మొబలైజేషన్ ఫౌండర్ జార్జ్ వర్వర్ అంటాడు. ఆదిసంఘం దేవుని వాక్యంతో సన్నిహిత సంబంధాన్ని కలిగి లోకాన్ని ప్రభావితం చేస్తే, నేడు బైబిల్ నిరక్షరాస్యత వల్ల లోక విధానాలు సంఘంలో చొరబడి సంఘాన్ని సమూలంగా నాశనం చేస్తున్నాయి.

యుఇయస్ఐ దేవుని వాకాన్ని కేంద్రంగా చేసుకొని, వాక్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చే సంస్థ. మన పితరులు అలాంటి పునాదిని వేశారు. బైబిస్ స్టడీస్, వ్యక్తిగత బైబిల్ అధ్యయనం, క్వైట్‌టైమ్, సిద్ధాంతాల బోధన, ప్రార్థనల ద్వారా దేవుని ప్రేమించేలా, వాక్యంతో సన్నిహిత సహవాసం కలిగి ఉండేటట్లు ప్రతి సభ్యునికి రక్షణ పొందిన రోజునుండి క్రమక్రమంగా ఇవన్నీ నేర్పిస్తున్నారు. అయితే ఇవన్నీ ఉన్నా అక్కడక్కడా మనలో కూడా బైబిల్ నిరక్షరాస్యత మన ప్రవర్తనలో, ప్రసంగాల్లో, పనిలో కనిపిస్తూనే ఉంది. బైబిల్ నిరక్షరాస్యతకు పరిష్కారం "ప్రతి విశ్వాసి బైబిల్ గ్రంథం యొక్క మనిషిగా మారాలి" అని అంటాడు జార్జివర్వర్. అంటే వాక్యంతో మన జీవితంలోని ప్రతిరంగం పెనవేసుకుపోవాలి. దేవుని వాక్యం పట్ల ఆపేక్ష, ఆధ్యాత్మిక అసంతృప్తిని మనం ఎల్లప్పుడూ కలిగి ఉండాలి. దీనికోసం ఉద్దేశపూర్వకంగా ప్రణాళిక కలిగి, పట్టుదలతో కృషి చేయాలి.

మనం ఇప్పటికే అలవర్చుకొన్న ఈ అలవాట్లనుండి తప్పిపోకుండా మరి ఎక్కువగా వీటి కోసం సమయాన్ని కేటాయిద్దాం. 1. వాక్యాన్ని చదవడం (యెష 34:16; 1 పేతు 2:1-3), 2. వాక్యాన్ని అధ్యయనం చేయడం (ఎజ్రా 7:10; అపో 18:24; 17:11), 3. వాక్యాన్ని ధ్యానించడం (కీర్త 1:2; యెహోషువా1:8), 4. వాక్యానికి విధేయత చూపించడం (యోహా 15:20బి; కీర్త 119:22, 55), 5. వాక్యాన్ని హృదయంలో భద్ర పరచుకోవడం/ కంఠస్థం చేయడం (కీర్త 119:11),, 6. వాక్యానుసారంగా నడుచుకోవడం (కీర్త 119:9, 105), 7. వాక్యాన్ని బోధించడం (1 తిమో 4:11-13; ఎజ్రా 7:10).

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 30, No. 8 June 2024
UESI Publication Trust -
Andhra Pradesh Branch



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI Publication Trust -AP Branch
C/o. UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
STUDENTS (1 Year) - Rs. 150
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (1 Year) - Rs.300
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:

**Account Name: UESI-AP-VIDYARTHI JWALA**
**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**Account Name: UNION OF EVANGELICAL STUDENTS**
**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**Account Name: UESI-AP-PUBLICATION TRUST**
**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**
**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

July: Social Evils
August: Minority - Majority
September: Core Values

**Note:** Please send your writeups on or before
**10th of every month**


# నీ వేలి ముద్రలేవి?

వర్షించకుండానే వెళ్ళిపోయిన మేఘంలా
జ్వలించకుండానే ఆరిపోయిన దీపంలా మట్టిలో
తలాంతుల్ని పాతేసుకుని
నీలోని అగ్నిని లోలోనే ఆర్పేసుకుని
ఒక చిరునవ్వునైనా వెలిగించకుండా
ఒక భుజాన్నైనా ఆప్యాయంగా తట్టకుండా
ఈ లోకాన్ని వదిలి వెళ్తావా?

ఏమీ అమ్మకుండానే
దుకాణం మూసేసినట్టు
పాడకుండానే కచేరి కట్టేసినట్టు
ఏమీ సాధించకుండానే అలసిపోయి
అసలు జీవించకుండానే చనిపోయి
కాలగర్భంలో నువ్వు కలిసిపోతుంటే
ప్రపంచం నిన్ను చూసి
గుండెలు బాదుకునే ఉంటుంది !



చరిత్రపుటల్లో నీ గురించి
ఒక పేజీ కూడా నింపకుండా
కనీసం నీవు వచ్చి వెళ్ళిన
జాడలేవీ వదలకుండా
ఈ లోకాన్ని వదిలి వెళ్తావా ?

– తాళ్ళూరి ప్రసాద్

## లోపలి పేజీల్లో...


- బైబిల్ నిరక్షరాస్యత - 2
- మార్పు-మంచి ముగింపు - 4
- ప్లానింగ్ ప్రాధాన్యత ఏంటి? - 5
- ప్రణాళిక వృద్ధిచెందడానికే - 8
- పరిచర్యలో ప్లానింగ్ - 12
- సోమరితనం - 14
- హార్డ్‌వర్క్ - 15
- కాన్‌స్టాంటైన్ దర్శనం - 18
- కుటుంబంలో నాయకత్వం - 21
- సమయాన్ని సద్వినియోగం చేసుకో - 25
- బంగారం కంటే శ్రేష్ఠమైనది - 28
- ప్లానింగ్ ఎందుకు దండగ! - 29
- విలియం కేరీ జీవితంలో ఒక రోజు- 31
- బంగారు కలలు - 32

# మార్పు – మంచి ముగింపు

"మీరు వెనుకకు వెళ్ళి ప్రారంభాన్ని మార్చలేరు, గానీ మీరు ఉన్న చోట నుంచి ప్రారంభించి ముగింపును మార్చవచ్చు" అని అంటాడు గొప్ప క్రైస్తవ మేధావి సి.యస్. లూయిస్.

చాలామంది తమ ప్రస్తుత జీవితాన్ని చూసి గతంలో చక్కగా జీవించి ఉంటే, లేదా ఏదైనా పని చక్కగా ప్రారంభించి ఉంటే ప్రస్తుత పరిస్థితి చాలా బాగుండేదని నిరాశ, నిస్పృహలతో ఉంటారు. మంచి కుటుంబంలో పుట్టి ఉంటే, చిన్నప్పటినుంచి చక్కగా గైడ్ చేసే వారుంటే, అమ్మానాన్నలు మంచి సంపన్నులయితే లేదా విద్యాధికులైతే, ఉపాధ్యాయులు చక్కగా బోధించి ఉంటే, చిన్నప్పటి నుంచి మంచిగా చదువుకొని ఉంటే లేదా చక్కని క్రమశిక్షణ పాటించి ఉంటే...ఇలా చాలా విషయాల్లో గతం గూర్చి ఆలోచించి ప్రస్తుత జీవితాన్ని దుఃఖమయం చేసుకొన్నవాళ్ళు ఉంటారు. ఎవరైననూ క్రీస్తునందున్న యెడల వారు నూతన సృష్టి. సమస్తము దేవుని వలననైనవి అనే మాట ఒనేసిమును గూర్చి పౌలు ఇచ్చిన సాక్ష్యం చూస్తే స్పష్టం అవుతుంది. మన గతంతో సంబంధం లేకుండా మన గతిని మన గురువుగారు మార్చగలరు.



పారిపోయినవాడు – పరపతి, ప్రగతి సాధించాలన్నా

అపజయం పొందినవాడు – అద్వితీయ విజయాన్ని సాధించాలన్నా

ప్రభువు బిడ్డల ప్రాణాలు తీసేవాడు – ప్రభువు కొరకు, ఆయన పిల్లల కొరకు ప్రాణం పెట్టాలన్నా

ప్రయోజనం లేనివాడు – ప్రయోజకుడు కావాలన్నా

అనామకుడు – అధిరోహించాలన్నా

దొంగ – దొడ్డవాడు కావాలన్నా

విశ్వాసుల హృదయాలు – విశ్రాంతి పొందాలన్నా

వికసించిన హృదయాలు – విశేషమైన ఆదరణ పొందాలన్నా

ఇలా...ఏమి జరగాలన్నా – క్రీస్తే మన మనసులో వెలగాలి

ఆధునిక పౌలు, ఫిలేమోను, ఒనేసిములు ప్రభువు యొక్క రక్తంలోనుంచే పుట్టుకొస్తారు. చరిత్రకారుని కొరకు చరిత్ర సృష్టిస్తారు, చరిత్రలో నిలిచిపోతారు. యుఇయస్ఐ కుటుంబ సభ్యులుగా నూతన సంవత్సరాన్ని ప్రారంభించిన మనం, మన గతంతో సంబంధం లేకుండా ఉన్న చోటు నుండి ప్రారంభించి ముగింపును మారుద్దాం.

మన జీవితాన్ని తరచి చూసినప్పుడు మన ప్రారంభాలు దయనీయమైనవని గ్రహించి, ఉన్న చోటునుంచి ప్రారంభించి ముగింపును మారుద్దాం. మరో పౌలు, ఫిలేమోను, ఒనేసిములుగా మనం మన సహవాసంలో మారి – మార్పుకు మార్గదర్శకమవుదాం. మహోన్నతుని మనసులో మహా ఆనందం నింపుదాం!

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్

యుఇయస్ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# ప్లానింగ్ ప్రాధాన్యత ఏంటి?

## ప్రణాళికా రచన అంటే ఏంటి?

ప్రణాళికా రచన అంటే – లక్ష్యాల్ని నిర్దేశించడం, ఆ లక్ష్యాల్ని సాధించడానికి అవసరమైన వనరులు, చర్యల్ని నిర్ణయించడం.

క్రైస్తవ ప్రణాళికకు ఇహలోక ప్రణాళికకు తేడా ఏంటంటే – ఇహలోక ప్రణాళిక పూర్తిగా మానవ మేధాసంపత్తి మీద, మానవ వనరులమీద, మానవ ప్రయత్నం మీద ఆధారపడి ఉంటుంది. క్రైస్తవ ప్రణాళిక క్రీస్తుని కేంద్రంగా చేసుకొని, దేవుడిచ్చే జ్ఞానంతో, దేవుని మనసెరిగి, దేవుని ప్రణాళికలను, దేవుని సాయంతో అమలు చేసి దేవుడిచ్చే సఫలతను పొందుకోవడం.

ఇది నెహెమ్యా గ్రంథం 2వ అధ్యాయంలో చక్కగా వివరించబడింది. దేవుడిచ్చిన సలహా (12వ) మేరకు, దేవుని సహాయంతో (18వ), ఓ దైవజనుడు పని చేయడంవల్ల దేవుడిచ్చిన సఫలతను (20వ) చవిచూడగలిగాడు. ఇశ్రాయేలీయులందరూ కలిసి ఒకరిమీద ఒకరు ఆధారపడి, పని చేయడానికి మనస్సు మక్కువ కలిగి, అంత గొప్ప పనిని 52 రోజుల్లో పూర్తి చేయగలిగారు.

## మన పరిచర్యలో ప్రణాళికలు

మన లక్ష్యాన్ని సాధించడానికి కొన్ని వ్యూహాల్ని (స్ట్రాటజీలు) నిర్దేశించుకోవాల్సి ఉంటుంది. అవి మనమిప్పుడున్న స్థితి నుండి దేవుడు మనం ఉండాలని కోరుకున్న స్థితికి తీసుకెళ్ళడానికి ఉపకరిస్తాయి. దేవుడు మనం ఉండాలని కోరుకునే స్థితిని తెలుసుకోవడానికి నాయకులు ఆయన సన్నిధిలో గడిపి, ఆయన మనసు ఎరగాల్సిన అవసరం ఉంది. దాన్ని అనుసరించి 2000 సంవత్సరంలో నూతన సహస్రాబ్ది ముంగిట్లో మన రాష్ట్ర నాయకులంతా కలిసి ప్రార్థనా పూర్వకంగా ఎంచుకున్న ప్రణాళిక లోని రెండు ప్రాముఖ్యమైన ప్రక్రియలు – ప్రభువుపనిలో అందరు పాలు పంచుకునే ప్రక్రియ (1:50:5:2), అందరి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపే ప్రక్రియ (1:3). గత ఇరవై మూడు సంవత్సరాల్లో వాటిననుసరించడం వల్ల మన రాష్ట్ర పరిచర్య ఎంత మెండైన రీతిలో ఫల భరితంగా జరిగిందో మనకు తెలుసు. ఇప్పటికే 14కు పైగా రాష్ట్రాలు వాటిని అనుసరిస్తున్నాయి. పోయిన సంవత్సరమంతా ఎంతో ప్రార్థనా పూర్వకంగా, అందరిని సంప్రదించి, అందరిని కలుపుకొని మన యల్ఆర్పి టీమ్ తయారు చేసిన యల్ఆర్పి 2030ని మనమిప్పుడు అనుసరిస్తున్నాం.

## మానవుని దైనందిన జీవితంలో ప్రణాళికా రచన ఆవశ్యకత ఏంటి ?

స్టూడెంట్ అయినా, గ్రాడ్యుయేట్ అయినా ప్రొద్దున లేచిన దగ్గర్నుంచి, ప్రొద్దు గుంకి నిద్ర పోయేదాకా ప్రతి పని క్రమబద్ధంగా చేస్తే గానీ మన ముందున్న లక్ష్యాల్ని సాధించలేము.

విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్, అన్ని చాప్టర్లు

**భవిష్యత్‌లో ఏం జరగబోతుందో మనకు తెలియదు కాబట్టి ప్రణాళికలు వేసుకోవడం వ్యర్థం అనే మేధావులు లేక పోలేదు. కానీ మన ప్రభువు గతానికి, వర్తమానానికి మాత్రమే కాదు, భవిష్యత్‌కు కూడా ప్రభువు. కొన్ని పరిస్థితులు మన చేయి దాటిపోయినట్లు అనిపించవచ్చు కానీ, ఆయనెల్లప్పుడూ సింహాసనం మీద ఉన్నాడు. ప్రతి పరిస్థితి ఆయన ఆధీనంలోనే ఉంది అన్న వాస్తవం మనల్ని ప్రణాళికలు వేసుకోవడానికి ప్రోత్సాహిస్తుంది.**

అందుబాటులో ఉన్న సమయంలోనే చదువుకొంటూ, ఇబియుఎన్, బిబియుఎన్, యంంపిసి, పర్సనల్ ఇవాంజిలిజంలకు సమయం కేటాయించాలంటే సమయ పాలన, ముందస్తు ప్రణాళిక ఎంతో ముఖ్యం. అది నీట్ కో, ఏపిసెట్ కో ప్రిపేర్ అయ్యే వాళ్ళు చెప్పగలరు.

మొన్న గ్రూప్ 2 ప్రిలిమ్స్‌లో సెలక్ట్ అయ్యి మెయిన్స్ కోసం ప్రిపేర్ అయ్యే వారినడిగినా, డియస్సీకి ప్రిపేర్ అయ్యే ఉద్యోగాల వేటలో ఉన్న వారినడిగినా ప్రణాళికా బద్ధంగా చదవాల్సిన అవసరం గురించి బాగా చెప్తారు.

ఓ ఉద్యోగిగా నిద్ర లేవడం, ప్రార్థన, వాక్యధ్యానం, కాలకృత్యాలు, కళాశాలకో/ఆఫీసుకో సిద్ధపడడం, సకాలానికి వెళ్ళడం, మనకప్పగింపబడిన పని ప్రతిభావంతంగా పూర్తి చేయడం, తిరిగి ఇంటికి ప్రయాణమయ్యే దారిలో కొంత షాపింగ్, ఇంటికొచ్చి రిఫ్రెష్ అయ్యి, విద్యార్థులతో గడపడానికి కొంత సమయం, కుటుంబంతో క్వాలిటీ సమయం – ఇవన్నీ సాధ్యం కావాలంటే అన్నింటిని ఎంతో ప్రణాళికా బద్ధంగా చేస్తేనే గానీ ఆ రోజును సక్సెస్ ఫుల్‌గా ముగించలేము.

ఓ గృహిణి రేపటి ప్రొద్దున్న టిఫిన్ దగ్గరనుండి, పిల్లల్ని, భర్తని సిద్ధం చేసి సమయానికి స్కూల్‌కి, ఆఫీస్‌కి పంపడానికి ముందస్తు కసరత్తు ఎంత అవసరమో తెలుసా?



## ప్రణాళికా రచన గురించి బైబిల్ ఏమి చెబుతుంది?

ప్లాన్, ప్రణాళిక అన్న అర్థం వచ్చే పదాలు బైబిల్‌లో 200 సార్లు కంటే ఎక్కువ సార్లు రాయబడ్డాయి. మన దేవుడు క్రమానికి కర్త. ప్రతిదీ ఎంతో ముందు చూపుతో ప్రణాళికాబద్ధంగా చేస్తాడు.

దేవుడు సృష్టిని ఎంత ప్రణాళికాబద్ధంగా సృష్టించాడో మనకు తెలుసు. పతనమైన మానవుని విమోచించడం కోసం ఆయన వేసిన బృహత్ప్రణాళిక, దానికోసం ఆయన చెల్లించిన వెల మనకు తెలియనిది కాదు. నోవహు ఓడ, దేవుని మందసం, దేవుని ప్రత్యక్ష గుడారం, దేవుని ఆలయం నిర్మించడంలో దేవుడు ప్రతి చిన్న విషయంలోనూ ఎంతో శ్రద్ధ వహించి ఎంతో ప్రణాళికాబద్ధంగా చేయడం మనకు తెలుసు.

భవిష్యత్‌లో జరగబోయే – మన ప్రభువు రెండవ రాకడ, వెయ్యేండ్ల పాలన, ధవళ సింహాసన తీర్పు, నూతన భూమి, నూతన ఆకాశం, నూతన యెరూషలేము అన్నీ ఎంత పకడ్బందీగా ప్లాన్ చేశారో వాక్యంలో అతి చక్కగా వివరించబడింది.

మానవులందరి పట్ల దేవుడు కలిగి ఉన్న ప్రణాళిక మనకు తెలుసు. పతనమైన వానిని పరిరక్షించడం కోసం ఆయన వేసిన ప్రణాళిక, దాన్ని ఆయన అమలు పరుస్తున్న విధానం మనం చూస్తూనే ఉన్నాం. అందులో మన పాత్ర ఏంటో గుర్తించి దానిని మన శాయశక్తులా సమర్థవంతంగా నిర్వర్తించడం మన ఆధిక్యం, బాధ్యత, భాగ్యం. అది బిగ్ పిక్చర్ అయితే, మనలో ఒక్కొక్కరి పట్ల ఆయనకున్న ప్రణాళికలు స్మాల్ పిక్చర్. వాటి నెరవేర్పుకు మన విశ్వాసం, విధేయత కూడా ముఖ్యం. మా యెడల

నీకున్న తలంపులు బహు విస్తారములు అంటాడు దావీదు భక్తుడు. కీర్తన 40:5. నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను (ప్రణాళికలను) నేనెరుగుదును.. అవి హానికరమైనవి కావని, క్షేమకరమైనవని, నిరీక్షణ కలిగించేవని కూడా దేవుడు వివరిస్తున్నాడు. యిర్మీయా 29:11

## దావీదు జీవితంలో...

దావీదు దేవుని సంకల్పాన్నెరిగి దాని చొప్పున తన తరం వారికి సేవ చేసినట్లు, దేవుని ఉద్దేశాలన్నీ నెరవేర్చినట్లు అపోస్తలుల కార్యాలు 13లో చూస్తాం. దేవునికో సంకల్పం ఉన్నట్లు, ఆయన కొన్ని ఉద్దేశాలు కలిగి ఉన్నట్లు, ఓ దైవజనుని ఎంచుకొని అతనికి కావలసిన వనరులన్నీ అందించి అతని ద్వారా వాటిని నెరవేర్చుకున్నట్లు గమనించగలం.

మందసం తిరిగి ఇశ్రాయేలీయుల మధ్యకు తేవడం చాలా మంచి పని అయినా అది ఆయన ఉద్దేశించిన రీతిలో జరగాలి. దావీదు దేవుని సంప్రదించక (1 దిన. 15:2), తన స్వంత పద్ధతిలో (13:7), స్వంత శక్తితో (13:8) మందసమును తీసికొని రావడానికి ప్రయత్నించి విఫలం కావడం (13:10), దేవుని పద్ధతిలో (15:13), దేవుని సహాయంతో (15:26) తన ప్రయత్నంలో సఫలం కావడం చూస్తాము.

దేవునికి మన పట్ల, ఆయన మనకప్పగించిన పరిచర్య పట్ల గల ప్రణాళికను ఎరిగి దానిని నెర వేర్చడమే లక్ష్యంగా మనం జీవించాలి. దానిని ఎరగకుండా, ఎరిగి కూడా దానిని జరిగించకుండా ఉండే ప్రమాదం ఉందని గుర్తించి జాగ్రత్త పడాలి.

దావీదు దేవునికి ఆలయం నిర్మించాలను కోవడం మంచి ఉద్దేశమే అయినా అది తన కుమారుని ద్వారా జరిగించుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడని తెలు సుకొని అలానే జరిగించడం దావీదు గొప్పతనం.

మన స్వబుద్ధిని ఆధారం చేసికోకుండా, పూర్ణ హృదయంతో దేవుని యందు నమ్మిక ఉంచి, మన ప్రవర్తన అంతటిలో ఆయన అధికారానికి ఒప్పుకుంటే మన త్రోవలు సరాళం అవుతాయి. సామెతలు 3: 5,6.

## ప్రణాళికా రచన వ్యర్థమా/దండగా?

భవిష్యత్‌లో ఏమి జరగబోతుందో మనకు తెలియదు కాబట్టి ప్రణాళికలు వేసుకోవడం



వ్యర్థం అనే మేధావులు లేకపోలేదు. కానీ మన ప్రభువు గతానికి, వర్తమానానికి మాత్రమే కాదు, భవిష్యత్‌కు కూడా ప్రభువు. కొన్ని పరిస్థితులు మన చేయి దాటిపోయినట్లు అనిపించవచ్చు కానీ, ఆయనెల్లప్పుడూ సింహాసనం మీద ఉన్నాడు. ప్రతి పరిస్థితి ఆయన ఆధీనంలోనే ఉంది అన్న వాస్తవం మనల్ని ప్రణాళికలు వేసుకోవడానికి ప్రోత్సాహిస్తుంది.

ఇంతకు ముందు మనం వేసుకున్న కొన్ని ప్రణాళికలు అమలు కావడంలో వైఫల్యం కూడా అలాంటి అభిప్రాయానికి దారి తీస్తుంది. ఆ వైఫల్యానికి కారణం మన చేతకానితనమో, మన స్వయంకృతాపరాధమో కావచ్చు. అందుకని ప్రణాళికా రచనే వ్యర్థమంటే ఎలా?

ప్రణాళిక లేని జీవితం గందరగోళంగానూ, గాలికోసం ప్రయాస పడినట్లుగానూ ఉంటుంది.

## ప్రణాళికను అమలు చేయడం ఎందుకు కష్టం అవుతుంది?

ప్రణాళిక వేసుకున్నంత సులువు కాదు దాన్ని అమలు చేసి అనుకున్న ఫలితాలు సాధించడం. దానికెంతో నిబద్ధతతో కూడిన కఠోర పరిశ్రమ, అంకిత భావం అవసరం. దాని కెంతో వెల చెల్లించాలి. ఎన్నింటినో త్యజించాలి. ఆ క్రమంలో మనలో చాల మందిమి మధ్యలోనే చేతులు ఎత్తేస్తాం.

*"దేవునికో మనిషి కావాలి – తన వాగ్దానాన్నిచ్చి, తన ప్రణాళికను బయలుపరచి, తన శక్తిని ప్రదర్శించి, ఆ ప్రణాళికను అమలు చేసి, తను మహిమ పర్చబడడానికి. నిన్నో కళాఖండంగా మలిచి నీ ద్వారా తన హస్త కళా నైపుణ్యాన్ని ఈ లోకానికి ప్రదర్శించాలనుకొంటున్నాడు మన ప్రభువు. నువ్వందుకు సిద్ధమా?"*

– **పి. జాన్ విక్టర్,** కర్నూలు

ప్రత్యేకం




# ప్రణాళిక వృద్ధి చెందడానికే...

1954 సం॥లో అమెరికాలోని యేల్ యూనివర్శిటీ నుండి గ్రాడ్యుయేషన్ పొందిన వ్యక్తులపై ఒక సర్వే జరిగింది. వారిలో 3% మంది మాత్రమే తమ భవిష్యత్ గూర్చి, ఆర్థిక విషయాల్ని గూర్చి స్పష్టమైన రాతపూర్వక ప్రణాళికలు కలిగి ఉన్నట్లు కనుగొన్నారు. 10% మందికి స్పష్టమైన ఆలోచన ఉన్నా వారు వాటిని రాసుకోలేదు. 87% మందికి తమ జీవిత వృద్ధికి సంబంధించి సరైన ప్రణాళికలే లేవు. 20 సంవత్సరాల తర్వాత, ఈ యేల్ గ్రాడ్యుయేట్స్ గురించి మళ్ళీ ఒక సర్వే చేశారు. తమ ప్రణాళికలను, లక్ష్యాలను రాసుకొన్న 3% మంది మిగిలిన వారందరి కంటే ఎక్కువగా వారెంచుకొన్న రంగాల్లో స్పష్టమైన వృద్ధిని, డబ్బును సంపాదించారు.

"నీవు వృద్ధి చెందడానికి గురి/ప్రణాళిక ఏర్పాటు చేసుకోకపోతే, వృద్ధి చెందకుండా ఉండడానికి గురి ఏర్పాటు చేసుకొన్నట్లే" అని అంటాడు రాబర్ట్ షుల్లర్. పురోగతి సాధించాలనుకొన్న ఏ వ్యక్తి, సంస్థ అయినా ఒక ప్రణాళికాబద్ధంగా పనిచేయడం అవసరం.

## ప్రణాళిక ఎందుకు వేసుకోవాలి?

ప్రణాళిక మన వనరులను (ఉదాహరణ: సమయం, డబ్బు మొదలైనవి) ఎలా ఉత్తమంగా ఉపయోగించాలో, నిర్ణయించుకోవడంలో సహాయం చేస్తుంది. తద్వారా మన లక్ష్యాన్ని చేరుకోవడానికి అత్యంత ముఖ్యమైన సహకారం అందిస్తుంది. ప్రణాళిక మన విజయాలను ప్రభావవంతంగా సరిచూసుకొని అంచనా వేయడానికి ఆధారాన్ని ఇస్తుంది.

ఒక పని ఎవరు చేయాలో, ఎలా చేయాలో, ఎప్పుడు చేయాలో నిర్ణయించడానికి, మన కలల ను లేదా నిర్దేశించుకొన్న లక్ష్యాలను, సాకారం చేసుకోవడానికి ప్రణాళిక అవసరం.

ప్రణాళిక అనేది మనం ఏ స్థాయికి వెళ్లాల నుకొంటున్నామో, మనం ఏమి సాధించాల నుకొంటున్నామో ముందుగానే నిర్ణయించే ప్రక్రియ కాబట్టి అది మన జీవితంలో భాగం కావాలి. ప్రణాళిక ఖచ్చితంగా మనకు దిశానిర్దేశం చేస్తుంది. థామస్ ఆల్వా ఎడిసన్ ఇలా అంటాడు "అవకాశం, ప్రణాళిక కలిసినప్పుడు అదృష్టం ఏర్పడుతుంది". కాబట్టి మన జీవితంలోని ప్రతి విషయంలో ప్రణాళిక వేయడానికి మన మనసును సిద్ధపరచుకొందాం.

అంతరిక్ష నౌకను చేయడం వంటి అతిపెద్ద ప్రాజెక్ట్సులోనూ, టేబుల్‌పై రాత్రి భోజనాన్ని సిద్ధం

**“కృపలో ఎదగండి” అంటే ‘ఆయనను సంతోషపెట్టడంలో ఎదగమని’ అర్థం.**
**మనకోసం తన ప్రాణాన్ని అర్పించిన మన దేవునిని మనం సంతోషపెట్టాలి.**
**మానవులుగా మనం అనేక వైఫల్యాలను, లోటుపాట్లను, పడిపోయే పరిస్థితులను కలిగి ఉన్నాము.**
**మన ప్రభువు తన అమూల్యమైన రక్తంతో మనల్ని కొన్నాడు, మనము ఆయన ఆస్తి.అయినప్పటికీ,**
**మనం ఆయనను అనేక విధాలుగా అసంతృప్తికి గురి చేస్తున్నాము.**

చేయడం వంటి వాటిలోనూ ప్రణాళిక అవసరం. ప్రస్తుతం జీవన అవసరాలను బట్టి మన జీవితాలు మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి, అయినప్పటికీ మనము ముందుగా ప్రణాళిక తయారు చేసికొని దానిని అమలు చేయడానికి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే విజయవంతంగా ముందుకు సాగవచ్చు.

“సిద్ధపడడంలో విఫలమైతే, మీరు విఫలం కావడానికి సిద్ధమవుతున్నారు” అని అంటాడు బెంజమిన్ ఫ్రాంక్లిన్.

### ఏ యే విషయాల్లో ప్రణాళిక కలిగి ఉండాలి?

### ఎ. దేవునిలో ఎదిగే విషయంలో

2 పేతురు 3:18 “మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందుడి”. ఈ వచనం దేవునిలో, ఆయనకు సమీపంగా ఉండడంలో ఎదగడాన్ని సూచిస్తుంది. ఇది యాంత్రికంగా జరగదు. దాని కోసం మనం ప్రణాళిక తయారు చేసుకోవాలి. “కృపలో ఎదగండి” అంటే ‘ఆయనను సంతోష పెట్టడంలో ఎదగమని’ అర్థం. మనకోసం తన ప్రాణాన్ని అర్పించిన మన దేవునిని మనం సంతోషపెట్టాలి. మానవులుగా మనం అనేక వైఫల్యాలను, లోటుపాట్లను, పడిపోయే పరిస్థితులను కలిగి ఉన్నాము. మన ప్రభువు తన అమూల్యమైన రక్తంతో మనల్ని కొన్నాడు, మనము ఆయన ఆస్తి. అయినప్పటికీ, మనం ఆయనను అనేక విధాలు గా అసంతృప్తికి గురిచేస్తున్నాము. కనుక మనము ఆయనను సంతోషపెట్టడం చాలా క్రమపద్ధతిలో చేయాలి.

ముందుగా మనకు అలాంటి కోరిక ఉండాలి. ఆయన పిల్లలుగా మొదట మన హృదయాలలో అలాంటి కోరిక ఉంటుంది, ఈ కోరికను పెంపొందించుకోవాలి. పౌలు ఇలా అంటాడు “కావున దేహమందున్నను దేహమును విడిచినను, ఆయన కిష్టులమై యుండవలెనని మిగుల అపేక్షించుచున్నాము”.(2 కొరింథీ 5:9). ఇది పౌలు జీవితకాల లక్ష్యం.

ఏ లక్ష్యాన్ని అయినా సరైన ప్రణాళిక ద్వారా మాత్రమే సాధించవచ్చు. 2 పేతురు 1:5-8 ఇలా చెప్తుంది “ఆ హేతువుచేతనే **మీమట్టుకు మీరు పూర్ణజాగ్రత్తగలవారై,** మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనము నందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను **అమర్చుకొనుడి**” ఈ లక్షణాలు మన ప్రభువైన యేసుక్రీస్తు గురించి మనకున్న జ్ఞానము ద్వారా వ్యర్థమైన, అనవసరమైన విషయాలనుండి మనలను దూరంగా ఉంచుతాయి. పూర్ణ జాగ్రత్త ఎందుకోసమంటే దేవునిలో ఎదగడానికే. దీనికోసం మనము ప్రణాళిక కలిగి ఉండాలి.

### దేవునిలో ఎదగడానికి ప్రణాళిక ఏంటి?

**1. మౌనధ్యానం, ప్రార్థన, బిబియస్**

క్రమం తప్పని మౌనధ్యానం, వ్యక్తిగత ప్రార్థన మన ఎదుగుదలకు ప్రాథమిక సాధనాలు. ఈ రెండు గొప్ప ఆధ్యాత్మిక అభ్యాసాల ప్రాముఖ్యతను మనం అర్థం చేసుకోవాలి. ఈ రెండు అభ్యాసాల్ని ప్రతిరోజూ గొప్ప సంకల్పంతో చేయాలి. అయితే



ప్రారంభంలో మనం వీటిని చేయడానికి చాలా కష్టపడినప్పటికీ, అవి మన పవిత్రమైన అలవాట్లు అవుతాయి. ఈ అంశంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా అజాగ్రత్త ఉండకూడదు. మన బద్ధకాన్ని అధిగమించడానికి మనము సరైన సమయాన్ని (సాధారణంగా ఉదయాన్నే), సరైన ప్రదేశాన్ని (ఎటువంటి ఆటంకాలు లేని) ఎంచుకోవాలి. ఈ రకమైన ప్రణాళిక ప్రభువు పట్ల మన కోరికను పెంపొందించడంలో గొప్ప సాఫల్యాన్ని అందిస్తుంది. "'దుప్పి నీటివాగులకొరకు ఆశపడునట్లు దేవా, నీకొరకు నా ప్రాణము ఆశపడుచున్నది" (కీర్తనలు 42:1) అని కోరహు కుమారులు అంటారు. అలాగే మీ ప్రార్థన సమయంలో ఎదగడానికి, మిమ్మల్ని మీరు క్రమశిక్షణలో ఉంచుకోవాలి. మీరు ఉపవాస ప్రార్థన చేయాలి.

కనీసం నెలకు ఒకసారి పిబియస్ చేయడం అవసరం. ఆ రోజు, సమయాన్ని ముందే ఎంచుకొని దాని కోసం ప్రార్థించడం ద్వారా దానిని చక్కగా చేయగలుగుతాం.

### 2. సహవాసానికి హాజర్వడం

మన ఎదుగుదలకు సహాయపడే రెండవ ప్రణాళిక సహవాసం. దేవునితో సహవాసం ఇతర విశ్వాసులతో సహవాసం కలిగి ఉండడానికి మనలను ప్రోత్సహిస్తుంది. ఇబియస్, బిబియస్, ఇజియఫ్ బైబిల్ స్టడీస్‌కు క్రమం తప్పకుండా హాజరు కావడం మన ఎదుగుదలకు తప్పనిసరి. అలాగే, ప్రతి ఆదివారం సంఘానికి వెళ్ళి ఆయనను ఆరాధించాలి.


### 3. ఆత్మీయ పుస్తకాలు చదవడం

ఒక గొప్ప వ్యక్తి ఇలా చెప్పాడు "సాధారణ స్థితి నుండి పైకి ఎదగాలని కోరుకునేవారికి చదవడం చాలా అవసరం". బైబిల్‌పై, కొన్ని అంశాలపై మంచి పుస్తకాలు చదవడం ద్వారా, బైబిల్ భాగాలను ధ్యానించడం నేర్చుకోవచ్చు, ఆత్మీయంగా ఎదగవచ్చు.

వెస్లీ డ్యూవెల్ రాసిన "విజయాన్ని సాధించే శక్తివంతమైన ప్రార్థన" అనే పుస్తకాన్ని దయచేసి చదవండి. ఇది మీకు మరింత ఎక్కువగా ప్రార్థించడానికి చాలా సహాయ పడుతుంది. ఈ పుస్తకం మిమ్మల్ని ఎక్కువ గంటలు ప్రార్థించమని, ఆయన సన్నిధిని ఆస్వాదించమని ప్రోత్సహిస్తుంది. పైన పేర్కొన్న పుస్తకం లాగానే మీరు చాలా పుస్తకాలను చదవాలి. ఆస్వాల్డ్ సాండర్స్ రాసిన "ఆత్మీయ నాయకత్వం" అనే పుస్తకం జీవితములో అనేక విషయాలలో మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవడానికి సహాయ పడుతుంది. అలాగే, ప్రసిద్ధ రచయితలు రాసిన పుస్తకాల్ని ఎంచుకొని క్రమపద్ధతిలో అధ్యయనం చేయండి. ఇవి ఆత్మీయంగా ఎదగడానికి ఎంతో సహాయపడతాయి.

### బి. విద్యార్థులు చదువులో

దేవుని పిల్లలుగా విద్యార్థులు చదువులో రాణించాలి. ఇయు విద్యార్థికి ఇది చాలా ముఖ్యమైన బాధ్యత. విద్యార్థులు చదువుకోవడానికి నిర్దిష్ట సమయాన్ని కేటాయించే టైమ్‌టేబుల్‌ని కలిగి ఉండాలి. తరగతులకు క్రమం తప్పకుండా హాజరుకావడంతో పాటు, విద్యా సంవత్సరం ప్రారంభం నుండే ఈ చదువుకునే సమయం కలిగి ఉండాలి. దీన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల మీ చదువులో పేలవమైన పనితీరు ఏర్పడి, దేవునికి, మీకు వ్యక్తిగతంగా, మీ తల్లిదండ్రులకు అవమానం వస్తుంది. మీ కోర్స్ మొదటి నెలలో సిలబస్, అవసరమైన పుస్తకాలు, మోడల్ ప్రశ్నా పత్రాలు సేకరించాలి. మీ ఉపాధ్యాయులను విశ్రాంతి సమయంలో కలవడం, వారితో చాలా ఆహ్లాదకరంగా మాట్లాడడం, వారి సలహాలను తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మీ సీనియర్స్ సూచనలు కూడా మీకు సహాయ పడతాయి. మీరు ప్రణాళిక లేకుండా ఏదైనా చేయడానికి ప్రయత్నిస్తే, మీ సమయం వృధా అవుతుంది, మీరు అన్ని అంశాలను కవర్ చేయలేరు. కొలస్సీ 3:23-



24లో దేవుని వాక్యం ఇలా చెబుతుంది, "ప్రభువు వలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరుగుదురు గనుక మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి". కాబట్టి మీరు కష్టపడి చదివితే, మొదటి లబ్ధిదారు మీరే అవుతారు. ప్రతిఫలం మన దేవుడి నుండి వస్తుంది.

## సి. గ్రాడ్యుయేట్స్ కుటుంబంగా, ఉద్యోగంలో ఎదిగే విషయంలో

### 1. నాణ్యమైన సమయాన్ని గడపడానికి

మీరు కుటుంబంగా, మీ సంబంధాల్లో ఎదగాలంటే మీరు చాలా ప్లాన్ చేసుకోవాలి. మీరు మీ జీవిత భాగస్వామితో, పిల్లలతో గడిపే సమయాన్ని ప్లాన్ చేసుకోవాలి. ఆ సమయం మీ జీవిత భాగస్వామిని మీరు అర్థం చేసుకోవడానికి, ఆమె/అతడు మిమ్మల్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. మీ పిల్లలతో సమయాన్ని గడపడం ద్వారా మీరు వారికి ఆధ్యాత్మిక విద్యను అందించవచ్చు, మీరు వారిని ఎంతగా ప్రేమిస్తున్నారో వారు అర్థం చేసుకొంటారు. మీ ఉద్యోగం, ఇతర విషయాల యొక్క బిజీ షెడ్యూల్‌లలో, మీరు ప్లాన్ చేయకపోతే, మీరు మీ పిల్లలు లేదా జీవిత భాగస్వామితో నాణ్యమైన సమయాన్ని గడపలేరు.

### 2. ఆర్థిక విషయాలు

ఆర్థిక విషయాల కోసం కూడా ప్లాన్ చేసుకోవాలి. బడ్జెట్‌ను తయారు చేయడానికి భార్యాభర్తలు ఇద్దరూ కలిసి కూర్చోవాలి. సరైన ప్రణాళిక లేకుండా డబ్బు ఖర్చు చేస్తే, అప్పుల పాలై, మీ భవిష్యత్తు అవసరాల కోసం మీరు డబ్బును ఆదా చేయలేరు. మీ భవిష్యత్ అవసరాలకు సంబంధించినంత వరకు ఇది చాలా ముఖ్యమైన పని. మీ పిల్లలు ఉన్నత చదువులు చదివే కొద్దీ మీరు ఎక్కువ డబ్బు ఖర్చు చేయాలి. ఈ విషయంలో మీకు దేవుని జ్ఞానం కావాలి, లేదంటే అవసరం లేని అనేక వస్తువులను కొనుగోలు చేసి అప్పుల పాలవుతారు. మీరు మీ దశమభాగానికి అదనంగా మీ ఆదాయంలో కొంత భాగాన్ని దేవుని పని కోసం కేటాయించాలి. దీనిని జాగ్రత్తగా ప్లాన్ చేయకపోతే, మీరు దశమ భాగం కూడా ఇవ్వలేరు.

మీరు కొన్ని అకస్మికంగా వచ్చే ఖర్చులను



భరించడానికి సిద్ధంగా ఉండాలి. మీ వయసు పెరిగేకొద్దీ, మీ ఆరోగ్యానికి సంబంధించి అనేక సవాళ్ళను ఎదుర్కొంటారు. మీ కోసం, మీ జీవిత భాగస్వామి ఆరోగ్యం కోసం మీరు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి రావచ్చు. గనుక కుటుంబంలో ఆర్థిక ప్రణాళిక అత్యవసరం.

### 3. ఉద్యోగం

ఒక గ్రాడ్యుయేట్‌గా, మీరు మీ వృత్తిలో రాణించడానికి కూడా ప్రణాళిక అవసరం. మీ విభాగానికి సంబంధించిన విషయాలను అధ్యయనం చేయండి. మీ విధులను క్రమపద్ధతిలో నిర్వర్తించడానికి ప్రయత్నించండి. "తన పనిలో నిపుణత గలవానిని చూచితివా? అల్పులైనవారి యెదుట కాదు వాడు రాజుల యెదుటనే నిలుచును" (సామెతలు 22:29). విలువలతో రాజీ పడకుండా మీ యజమానిని సంతోషపెట్టడం గురించి మీరు ఆలోచించాలి. మీకింద పనిచేసే వారికి మంచి పద్ధతిలో ఆదేశించడం నేర్చుకోండి.

## ముగింపు

కొంతమంది విశ్వాసులు ప్రణాళిక చేయడం ఆధ్యాత్మికం కాదు, లోకసంబంధమైందని అనుకుంటారు. మరికొంత మంది ప్లాన్ చేసుకొన్నా, అమలు సాధ్యం కాదని గురి, గమ్యం లేకుండా జీవిస్తుంటారు. ఇవి తప్పుడు అవగాహనలు. "శ్రద్ధగలవారి యోచనలు (ప్లాన్స్) లాభకరములు తాలిమిలేక పనిచేయువానికి నష్టమే ప్రాప్తించును" (సామెతలు 21:5) అని బైబిల్ వ్యక్తి జీవితంలో ప్లానింగ్ ప్రాధాన్యతను తెలియజేస్తుంది. గనుక ప్రతి విషయంలో దేవుని సహాయంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకొని దేవుడు ఆశించిన రీతిలో ముందుకు సాగుదాం.

– యం. జాన్ కెనడీ, నందిగామ

# పరిచర్యలో ప్లానింగ్

ఐపియల్ 2024 సీజన్‌లో ఈడెన్ గార్డెన్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించి కొలకతా 'నైట్ రైడర్స్' ప్లే ఆఫ్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. ఈ మ్యాచ్‌ని విశ్లేషిస్తూ, వీరేందర్ సెహ్వాగ్, మెరుగైన ప్రణాళిక తో వచ్చి ఉంటే ముంబై ఇండియన్స్ మ్యాచ్‌ను గెలిచేది అన్నాడు.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన ఎన్నికల్లో మన దేశానికి చెందిన శశి థరూర్ పోటీ పడ్డారు. గెలవడమే తన లక్ష్యం అని దానికి సరిపడా కార్యాచరణ సిద్ధం చేసుకొన్నాను అని చెప్పాడు. కానీ పరాజయం పాలై ప్రస్తుతం పార్లమెంటు సభ్యునిగా ఉంటున్నాడు.

విజయం సాధించాలంటే ప్రణాళిక, దాని అమలు ఎంతో ప్రాముఖ్యమని పై రెండు సంఘటనలు మనకు స్పష్టం చేస్తున్నాయి. పరిచర్యలో కూడా ఫలితాలు సాధించాలంటే ప్రభువు నడిపింపుతో ప్రణాళికలు కలిగి ఉండడం ఎంతో అవశ్యం.

### పరిచర్యలో ప్రణాళికలు ఎందుకు?

1. ప్రణాళికలు డబ్బును, సమయాన్ని, ప్రయత్నాన్ని ఆదా చేస్తాయి.
2. వృధాను, అపజయాలను అరికడతాయి.
3. ఒక మూస ధోరణిలో వెళ్ళకుండా, సమాజంలోని మార్పుకు తగినట్లు పరిచర్య చేయడానికి తోడ్పడతాయి.
4. లక్ష్యాలను త్వరగా, సమర్థవంతంగా సాధించ డానికి ఇవి ప్రేరణగా ఉంటాయి.
5. అనిశ్చితను, అస్పష్టతను ఇవి తగ్గిస్తాయి.
6. నిర్వహించే కార్యక్రమాలకు స్పష్టమైన నిర్దేశాన్ని ఇస్తూ, కార్యకాపాలను సమన్వయం చేస్తాయి.
7. సభ్యుల మధ్య సహకారాన్ని పెంపొందిస్తాయి.



### పరిచర్యలో ప్రణాళికలు ఎలా ఉండాలి?

#### 1. దేవుడు మనకిచ్చిన విజన్, మిషన్‌కు అనుగుణంగా ఉండాలి

"మీరు సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించండి" (మార్కు 16:15) అనే ప్రేషిత ఆజ్ఞలో భాగంగా దేవుడు పితరులకు 'విద్యార్థి పరిచర్య' అనే దర్శనాన్ని ఇచ్చి యుఇయస్ఐ అనే సంస్థను లేవనెత్తాడు. "రూపాంతరం చెందిన విద్యార్థులు ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా కళాశాల విద్యార్థులను దేశ ప్రజలను ప్రభావితం చేయడం" మన దర్శనం. ఈ దర్శనానికి తగిన కార్యాచరణను మన మిషన్ నిర్వచిస్తుంది. "భారత దేశంలోని కళాశాల విద్యార్థులను క్రీస్తు సువార్తతో సంధించి వారు సంఘానికి, సమాజానికి సేవ చేసే యేసుక్రీస్తు ప్రభువు శిష్యులుగా తర్ఫీదు చేయడం".

దేవుడు మనకిచ్చిన విజన్, మిషన్‌కు అనుగుణంగా మన పరిచర్య ప్రణాళికలు ఉండాలి. ప్రతి సభ్యుడు ఈ విషయాల పట్ల అవగాహనతో, భారంతో, త్యాగంతో గొప్ప పరిచర్య చేసేలా వ్యక్తిగతంగా, ఇయు, ఇజియఫ్‌లుగా ప్రణాళిక కలిగి ఉండాలి. ఏదో కొద్దిమంది పని చేస్తుంటే, మిగిలిన వారు ప్రేక్షకుల్లాగా ఉండడం కాకుండా అందరూ పని చేసేటట్లు ప్రణాళిక వేసుకోవాలి.

#### 2. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ప్లాన్ చేసుకోవాలి

కమిటీ మీటింగ్స్‌కి చాలా ప్రార్థనా పూర్వకంగా సిద్ధపడి వెళ్ళాలి. క్రమ పద్ధతిలో అంశాలను క్షుణ్ణంగా ప్లాన్ చేయాలి. ఎక్కడా గందర గోళానికి, వ్యక్తులకు

ప్రాధాన్యత లేకుండా ప్రభువుకు ప్రాధాన్యత ఇచ్చేలా ఉండాలి. ప్లానింగ్ అద్భుతంగా ఉండి, దాన్ని అమలు పరచడం అధ్వాన్నంగా ఉండకూడదు. చాలా సార్లు మన కమిటీస్‌లో, వేలడిక్టరీల్లో ప్లాన్ చేశాముగానీ 'జరగలేదు, చేయలేదు' అనే మాట తరచూ వినిపిస్తూనే ఉంటుంది. అమలు చేయడంలో విఫల మవుతున్నామంటే వాటికి ప్రాధాన్యత ఇవ్వడంలో విఫలమయ్యామనే చెప్పాలి.

### 3. హడావుడి, నిర్లక్ష్యం పనికి రాదు

అప్పటికప్పుడు హడావుడిగా కాకుండా చాలా ముందుగానే కమిటీలు, కార్యక్రమాల్ని ప్లాన్ చేసుకోవాలి. కొన్నిసార్లు అనుభవం ఎక్కువై, ఆత్మీయత తగ్గి దేవుని మీద ఆధారపడడం తగ్గి, సరైన ప్రార్థన, ప్రణాళిక లేకుండా హడావుడిగా జరిగిన క్యాంప్స్, కార్యక్రమాలు, బైబిల్‌స్టడీస్ ఎన్నో ఉంటున్నాయి. ఇలాంటి వాటి వల్ల ఫలితమేమీ ఉండకపోగా శారీరక శ్రమ, డబ్బు ఖర్చు మిగులుతుంది.

ప్రణాళిక వేయడం ఒక ఎత్తు దానిని రాబోవు నాయకులకు అందించడం మరొక ఎత్తు. కాబట్టి ప్రణాళికా డాక్యుమెంట్స్, డైరీలు, ఫైళ్ళను భద్ర పరచి, తర్వాత వచ్చే నాయకులకు వీటిని అందించి ఈ ప్రణాళిక కొనసాగింపు దెబ్బతినకుండా చూడాలి. వీటి విషయంలో నిర్లక్ష్యం పనికిరాదు.

### 4. ఇప్పటికే ఉన్న ప్రణాళికలను స్వంతం చేసుకోవాలి

యుఇయస్ఐ-ఏపి పరిచర్య అభివృద్ధి కొరకు దీర్ఘకాలిక ప్రణాళిక-2030ని ఏర్పరచడం జరిగింది. ఈ ప్రణాళికలో ఏడు ఫోకస్ ఏరియాలు ఉన్నాయి. ఈ ఏడు విషయాలు, వాటిలోని ఉప అంశాల న్నిటిలో 2030 సం॥కి యుఇయస్ఐ-ఏపి పరిచర్య అత్యుత్తమ స్థాయిలో ఉండాలి. ఇది మనముందున్న గొప్ప సవాలు. గనుక ఈ ఏడు ఫోకస్ విషయాలు, వాటిలోని ఉప అంశాల కోసం ప్రతిరోజు వ్యక్తిగతంగా, ఇయు, ఇజియఫ్‌లుగా ప్రార్థిస్తూ, దాన్ని స్వంతం చేసుకొని నెరవేర్చుకోసం ప్రయాసపడాలి.

### 5. యూనివర్శిటీస్‌పై ఎక్కువ దృష్టి ఉంచాలి

చక్కని మేధోశక్తి, నిపుణత, ఆలోచించగల సామర్థ్యం, విద్యలో జ్ఞానము కలిగిన ప్రతిభావంతులు ఇక్కడ ఉంటారు. వీరు దేశ భవిష్యత్‌కు మూల స్థంభాలు, భావి భారత పౌరులు. వీరిని క్రీస్తు కొరకు గెలుచుకొనేలా మన ప్రణాళికలు ఉండాలి.

## బైబిల్లోని నాయకులు

బైబిల్‌లో ఉన్న ధీరులైన వారంతా తాము ఏమి చేయాలని పూనుకొన్నారో చాలా స్పష్టమైన ప్రణాళిక, దాని అమలులో ఖచ్చితమైన అవగాహనతో విజయవంతం అయ్యారు. దేవునిపై ఉన్న అచంచల మైన విశ్వాసం వారి ప్రణాళికకు పునాది మాత్రమే కాకుండా మూలరాయి కూడా. దావీదు, గిద్యోను, ఎస్తేరు(4-5 అధ్యా), నెహెమ్యా, దానియేలు (2:16-19), పౌలు తదితరులు ఈ కోవలోని వారే. అంతిమంగా, అత్యద్భుతంగా మన ప్రభువు వారు కూడా మానవాళి రక్షణ ప్రణాళిక పట్ల పరిపూర్ణమైన అవగాహనతో నెరవేర్చిన తీరు, మనకు ప్రణాళిక యొక్క ఆవశ్యకతను మన కళ్ళకు కట్టినట్లుగా వివరిస్తుంది.

## ప్రణాళిక లేకపోతే

అవగాహన లేకుండా పరిచర్యలో నిమగ్నమైతే అంతా గందరగోళంగా ఉంటుంది. ఆశించిన ఫలితాలు రావు. మన తెలుగు భాషలో ఉన్న ఒక సామెత "గుడ్డెద్దు చేలో పడినట్టుగా ...." ఎటువైపు దృష్టి సారించాలో తెలియక, ప్రయాసపడుతూ చెంతనే ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోలేక నిరాశతో ఉండి పోయే పరిస్థితులు కోకొల్లలుగా ఉంటాయి. చేయాల నుకునే విషయంలో స్పష్టత కొరవడుతుంది. రొటీన్‌గా యాంత్రికంగా పని సాగుతుంది. గమ్య రహితంగా పరిచర్య గమనం ఉంటుంది. తద్వారా ఫలితాల కోసం ప్రయత్నించడం ఉండదు.

## ముగింపు

పరిచర్యను ప్రారంభించిన మన పితరులు ఆశించినట్లుగా, భారత దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, కళాశాల విద్యార్థులకు సువార్తను అందించే క్రమంలో మనం ఎప్పటికప్పుడు మన ప్రణాళికలను నూతన పరచుకోవాలి. ఇంటర్నెట్ అత్యధికంగా వాడుతున్న ప్రస్తుత తరానికి,కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) అన్ని రంగాలలో విస్తరిస్తున్న నేటిదినాల్లోని విద్యార్థులకు వారి భాషలో, వారి సందర్భంలో సువార్తను అందించాలంటే, మనకు సరైన ప్రణాళిక అవసరం గనుక ప్రార్థిద్దాం, ప్రభువిచ్చిన నడిపింపుతో పరిచర్యలో ముందుకు వెళ్దాం.

**– జే. పాల్‌శామ్యూల్,** నంద్యాల



# సోమరితనం

**(సామెతలు 6:6-11)**

"సోమరిని చీమలయొద్దకు వెళ్ళమని చెబితే, చీమల్నే నా దగ్గరకు తీసుకు రండని" సోమరి అన్నాడంట. బైబిల్లో దేవుడు మొదటిగా సృష్టిని చేసి మానవుని సృజించి, పనిని అప్పగించాడు. పని చేయాలన్నది, కష్టపడాలన్నది దేవుని ఆలోచన. కానీ నేడు సోమరితనం ప్రతి రంగంలో ఎక్కువై పోతుంది.

భర్త భార్యతో 'ఈరోజు స్పెషల్ ఏంటీ?' అని అడిగితే, భార్య 'జొమాటోలో బిర్యానీ ఆర్డర్ చేశానండి' అని అంటుంది.

ఒక విద్యార్థి తన స్నేహితునితో 'అరేయ్ ఎగ్జామ్స్ షెడ్యూల్ వచ్చిందిరా!' అంటే, 'ఏం ఫర్వాలేదు రా ఇంకా రెండు వారాలు ఉందిగా అప్పుడు చదవొచ్చులే!' అని జవాబు.

'చెల్లీ క్వైట్‌టైమ్ చేశావా? దేవుడు ఈరోజు నీతో ఏం మాట్లాడాడు?' అంటే ....'అక్క...మరీ... నేను ఉదయం కొంచెం లేటుగా లేచాను. అందుకే.....'

'తమ్ముడూ మీ రూమ్ క్లీన్‌గా లేదేంటి?' 'అవును అన్నా వారం నుంచి రూమ్ తుడవలేదు!'

ఇలా ఆధునిక పోకడలకు అలవాటు పడిన మనము తెలియకుండానే అవి మనలను సోమరులు గాను, బద్ధకస్తులుగాను మారుస్తున్నాయి. విద్యార్థులు చదువుల్లో రాణించలేక, ఆత్మీయంగా ఎదగలేక సతమతమవుతున్నారు. గ్రాడ్యుయేట్స్‌గా మనము అర్థవంతమైన క్వైట్‌టైమ్ చేసుకొనే విషయంలోను, బైబిల్‌ని ధ్యానించుటలోను, చదవడంలోను, వాక్యం సిద్ధపాటులోను, నిర్లక్ష్యముతో కూడిన బద్ధకం మన జీవితాలను, మనం తీసుకొనే బైబిల్ స్టడీస్‌ను నాణ్యత లేకుండా చేస్తున్నాయి. ఫలితంగా నేటి విద్యార్థుల ను ప్రభువుకొరకు గెలుచుకోలేక పోతున్నాము, చేసే వృత్తిలో రాణించలేకపోతున్నాము.

దేవుని వాక్యం సోమరితనం గురించి అనేక విషయాలు చెబుతుంది. ఈ వాక్యభాగాన్ని ధ్యానించి దాని వెలుగులో మన జీవితాల్ని పరి శీలించుకొందాం.

## బైబిల్ స్టడీ చర్చకు ప్రశ్నలు

1. సోమరి అని ఎవరిని అంటారు, వారి లక్షణాల ను వివరించండి?
2. సోమరితనానికి మార్గాలు ఏంటి?
3. చీమల ప్రత్యేకత ఏంటి? వాటి జ్ఞానాన్ని వివరించండి?
4. సోమరికి నిద్రకు ఉన్న సంబంధం ఏంటి?
5. సోమరితనం ఎన్ని విధాల నష్టాలను కలగ చేస్తుంది?
6. సోమరితనం ఆత్మీయ జీవితముపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది?
7. సోమరితనం కెరీర్‌ని ఎలా పాడు చేస్తుంది?
8. సోమరితనం పరిచర్య మీద ఎలాంటి దుష్ప్ర భావాన్ని చూపుతుంది?
9. సోమరితనాన్ని ఏవిధంగా అధిగమించవచ్చు?
10. శరీరధారియైన యేసుక్రీస్తువారి జీవన విధానాన్ని వివరించండి?

సోమరి ఆశపడును గాని వాని ప్రాణమునకేమియు దొరకదు అని బైబిల్ చెబుతుంది. ఈ దినాలలో మనుష్యుల్లో ఎన్నో ఆశలు, కోరికలు ఉంటున్నాయి కానీ వాటిని పొందుకోలేకపోవడానికి సోమరితనం, బద్ధకం, నిరక్ష్యం కారణాలుగా ఉన్నాయి.

ప్రభువైన యేసుక్రీస్తువారు 30 సంవత్సరాలు వడ్రంగిగా తల్లిదండ్రులకు సహాయపడుతూ వచ్చారు. చెక్కలను చూసి టేబుల్‌గా మారమని పలకలేదు కానీ కష్టపడి పనిచేశారు, మానవాళికి రక్షణ కలుగునుగాక అని పలకలేదు కాని సిలువ మరణాన్ని పొందుకున్నారు. దేవుని పిల్లలుగా సోమరితనాన్ని వీడి దేవుడు ఇచ్చిన తలాంతులను దేవుని మహిమార్థమై ఖర్చు పెడితే దేవుడు రెండంతలుగా ఆశీర్వదిస్తాడు. సోమరిగా ఉండి "తుప్పు పట్టడం కంటే దేవుని పనిలో, దేవుని కొరకు అరిగి పోవుట మేలు".

– జె. సుస్మిత, స్టాఫ్, నెల్లూరు



# హార్డ్ వర్క్ @ కెరీర్

"మనస్ఫూర్తిగా పనిచేయలేని వారు జీవితంలో విజయాన్ని సాధించలేరు" అని అంటారు ఎ.పి.జె. అబ్దుల్ కలాం. అది పరిచర్యలోనైనా లేదా మన కెరీర్లోనైనా కావచ్చు. అనుకున్నది సాధించాలంటే అనుక్షణం శ్రమించాల్సిందే. శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేయుదురు. సామె 12:24. ఇ.యు. విద్యార్థిగా నీకు రెండు బాధ్యతలు ఉన్నాయి. ఒకటి చదువులో రాణించి ఉద్యోగంలో స్థిరపడాలి. రెండవది పరిచర్యలో పాల్గొనాలి. కాబట్టి ఈ రెండింటి మధ్య సమతూకం చాలా అవసరం. చదువుకి ప్రాముఖ్యతనిచ్చి దేవునిని ప్రక్కన పెడితే దేవుని ఆశీర్వాదాలను పోగొట్టుకుంటాం. ఒకవేళ పరిచర్యకి ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చి చదువును, కెరీర్‌ను నిర్లక్ష్యపెడితే ఫెయిల్యూర్ వస్తుంది. ఈ ఆర్టికల్ మొత్తం చదివిన తర్వాత మీ కెరీర్ కట్టుకోవడానికి ఎంత కష్టపడుతున్నారో, మీరు ఎంత సమతూకాన్ని కల్గివున్నారో, ఒక్కసారి ఆలోచన చేయండి.

ఈ మధ్య కాలంలో నేను కొంత మంది గ్రాడ్యుయేట్స్‌తో మాట్లాడినప్పుడు వారి నుండి వచ్చిన స్పందన ఏంటంటే, మనవాళ్ళు కార్పొరేట్ ఉద్యోగాలు చేయడానికి పనికిరారు. చాలా మంది విద్యను పూర్తి చేసుకొని కూడా ఖాళీగా ఉంటున్నారు. మనవాళ్ళు కొన్ని ఉద్యోగాలకే పరిమితం అయిపోయారు. చిన్న చిన్న ఉద్యోగాలతో సరి పెట్టుకొనే పరిస్థితులు ఎందుకు? కాలం మారుతుంది, పరిస్థితులు మారుతున్నాయి. కానీ మన ఇ.యు. విద్యార్థులలో ఎక్కువ మందిలో మార్పు రావడం లేదు.

దేవుని పిల్లలుగా మనం కాలంతో పాటు పోటీ పడలేమా? ఎందుకు మనం కష్టపడలేకపోతున్నాం? నీవు అనుకోవచ్చు నేను మంచి బ్యాక్ గ్రౌండ్ నుండి రాలేదు, మేము చాలా పేదవాళ్ళం, తెలుగు మీడియంలో చదివాను, మా అమ్మనాన్న చదువుకోలేదు... ఇలా కారణాలు ఎన్నైనా చెప్పవచ్చు. కానీ మన దేవునికి అసాధ్యమైనది ఏదీలేదు. కొలస్సీ 3:23-24 ప్రకారం మనం ఏది చేసినా ప్రభువుకొరకు మనస్ఫూర్తిగా చేయాలని దేవుడు కోరుకొంటున్నారు. 6 సం॥లు కష్టపడితే 60 సంవత్సరాలు నీవు సుఖంగా ఉంటావు. నీ చదువు పూర్తి అయిన తరువాత ఒక గ్రాడ్యుయేట్ అన్న దగ్గరకు వెళ్ళి నాకు పెళ్ళి సంబంధం చూడమంటే, వారు అడిగే మొట్టమొదటి ప్రశ్న నీవు ఏమి ఉద్యోగం చేస్తున్నావు? అంటే నీవు కుటుంబాన్ని పోషించగల

వా? లేదా? అని ఆలోచిస్తారు. మనలో ఎక్కువ మంది చదువు పూర్తయ్యాక ఉద్యోగం గురించి ఆలోచిస్తారు. కానీ నీవు విద్యార్థిగా ఉన్నప్పుడే నీకు జీవిత ప్రణాళిక అవసరం. వీటన్నింటిని బట్టి ఆలోచన చేస్తే మన విద్యార్థులలో చాలా మందికి ఎన్నో విషయాల మీద అవగాహన లేదు. కష్టపడడానికి ఇష్టపడడం లేదనిపిస్తుంది. “తన పనిలో నిపుణత గలవానిని చూచితివా? వాడు అల్పులైన వారి ఎదుట కాదు రాజుల ఎదుటనే నిలబడును” సామె 22:29. ఈ ప్రపంచానికి ఎక్కువ నూతన ఆవిష్కరణలు ఇచ్చింది క్రైస్తవ శాస్త్రవేత్తలే. దానికి కారణం వారు అహర్నిశలు పట్టుదలతో శ్రమించారు. దేవుడు ఆ కష్టాన్ని ఆశీర్వాదకరంగా మారుస్తున్నాడు. మరి నీవు?

## కష్టపడడానికి మన ఇ.యు. విద్యార్థుల ముందున్న కొన్ని సవాళ్ళు

**1. భాషా నైపుణ్యాలు:** “దేశ భాషలందు తెలుగు లెస్స” అన్నప్పటికీ తెలుగులో అద్భుతంగా మాట్లాడితే ఉద్యోగాలు రావు. నీ ఆన్‌లైన్ పరీక్షల దగ్గర నుండి ఇంటర్వ్యూల వరకు అన్నీ ఇంగ్లీష్‌తోనే ముడి పడివుంటాయి. ప్రస్తుత పరిస్థితులలో కార్పొరేట్ వ్యవస్థలో మనం ఫిట్ అవ్వకపోవడానికి ఇదొక ప్రధాన కారణం. నేను తెలుగు మీడియం నుండి వచ్చాను. నాకు ఇంగ్లీష్ రాదు అని సానుభూతి మాటలు మాట్లాడకూడదు.

దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నగోలు పరాయి దేశంలో ఉండి బానిసలుగా పర భాషలో ప్రావీణ్యాన్ని సంపాదించారు. దానికి కారణం వారు దేవుని కొరకు కష్టపడడానికి ఇష్టపడ్డారు. కాబట్టి దేవుడు వారికి సహాయం చేశాడు. దానియేలు 1:4,17, 20.




**2. సాఫ్ట్ స్కిల్స్:** ఇతరులతో ఎలా కలసి పని చేయాలి, ఏ సందర్భంలో ఎవరితో ఎలా మాట్లాడాలి, ఎలా కూర్చోవాలి, ఎలా నిలబడాలి, సందర్భాన్ని బట్టి ఎలా డ్రెస్ చేసుకోవాలి, ఎలా తినాలి, సంబంధాల్ని ఎలా కాపాడుకోవాలి... ఇలాంటివన్నీ సాఫ్ట్ స్కిల్స్ క్రిందకు వస్తాయి. ఇవి అందరిలో మనకు ఒక ప్రత్యేక గుర్తింపుని తీసుకొని వచ్చి, గౌరవానికి కారణమవుతాయి. ఇవి విద్యార్థులకి, ఉద్యోగం చేసే వారికి చాలా ప్రాముఖ్యమైనవి.

**3. కంప్యూటర్ జ్ఞానం:** నీకు ఇష్టమున్నా లేకపోయినా ఈ రోజుల్లో అన్ని పోటీ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. కాబట్టి ఖచ్చితంగా కంప్యూటర్ నేర్చుకోవాల్సిందే. అంతే కాదు కంప్యూటర్లో మన పనుల్ని మనం చేసుకోవడం నేర్చుకోవాలి. వచ్చిన ఈమెయిల్స్‌ని ఓపెన్ చేసి చూడడం, పంపడం నేర్చుకోవాలి. మన లెటర్స్ మనం టైప్ చేసుకోవడం, మెటీరియల్స్ తయారు చేసుకోవడం, మనకు అవసరమైన వాటిని నెట్ ద్వారా బ్రౌజ్ చేసుకోవడం మొదలగునవి నేర్చుకోవాలి.

**4. చదివే సబ్జెక్ట్ మీద పట్టు:** నీవు చదివే సబ్జెక్ట్‌లో నీకు పట్టు ఉండాలి. విషయ స్పష్టత మరియు బలమైన పునాది వేసుకోవాలి. నీ సొంత నోట్స్ తయారు చేసుకోవాలి. మెటీరియల్‌తో పాటు టెక్స్ట్‌బుక్స్ చదవాలి. ఇలా సబ్జెక్ట్స్ మీద పట్టు ఉన్నప్పుడు, పోటీ పరీక్షలు కూడా బాగా రాయగలుగుతారు.

**5. విద్యలో వస్తున్న మార్పులు:** మనం ఎప్పటికప్పుడు విద్యలో వస్తున్న నూతన మార్పుల్ని గమనించి వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. అవి మన కెరీర్‌ని ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవాలి. నూతన మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మనం అప్‌డేట్ చేసుకోవాలి లేకపోతే అవుట్‌డేట్ అయిపోతాము.

**6. పోటీతత్వం:** ఈ పోటీతత్వం అనేది ఆరోగ్యపరమైన పోటీతత్వమై ఉండాలి. దీనిని మనం కేవలం బైబిల్ నుండే అలవర్చుకోగలం. దానియేలును, తన స్నేహితుల్ని బబులోను రాజు పరీక్షించినప్పుడు వీరు పదంతల శ్రేష్ఠులని తెలియబడింది (దానియేలు 1:20). కారణం వారు దేవుని కలిగియుండి, పోటీ పడడానికి ఇష్టపడ్డారు, కాబట్టి ఎన్నో అననుకూల పరిస్థితుల్లో కూడా దేవుడు వారికి విజయాన్ని ఇచ్చాడు. ప్రస్తుత పరిస్థితులు కూడా ఉద్యోగం

పొందడానికి చాలా కష్టంగా ఉన్నాయి. కాంపిటేషన్ పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితులలో కూడా నీవు దేవునిమీద ఆధారపడి కష్టపడడానికి ఇష్టపడితే మనదేవుడు మనకు తప్పకుండా సహాయపడతాడు.

### మన విద్యార్థులలో కనిపిస్తున్న కొన్ని బలహీనతలు

- తమగురించి తాము తక్కువగా ఆలోచించడం
- ఎప్పటి పని అప్పుడు చేయకుండా వాయిదా వేయడం
- ఏకాగ్రత లేకపోవడం
- చదువును, పరిచర్యను బ్యాలెన్స్ చేసుకోలేక పోవడం
- వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో ఎక్కువ సమయాన్ని వృథా చేసుకోవడం
- పాపంలో జీవితాన్ని కొనసాగించడం
- ఎక్కువగా నిద్రపోవడం
- సమయ పాలన లేకపోవడం
- గ్రాడ్యుయేట్స్ అన్నవాళ్ళని అడిగి తెలుసు కోలేకపోవడం
- దేవుని సార్వభౌమ అధికారాన్ని అర్థంచేసుకొని ప్రతి విషయంలో ఆయన మీద అధార పడకపోవడం.
- జీవితానికి ఒక క్రమం లేకపోవడం,
- దేవుడిచ్చిన సామర్థ్యాలను గుర్తించకపోవడం.
- గమ్యం, ప్రణాళిక, పట్టుదలతో కష్టపడి పని చేయకపోవడం,
- నెగిటివ్‌గా ఆలోచన చేయడం

ప్రియమైన ఇ.యు. విద్యార్థులారా! ఉద్యోగాల కొరకు ప్రయత్నం చేస్తున్నవారలారా, ఒక్కసారి ఆలోచించండి! ఇన్ని బలహీనతలు పెట్టుకొని మనం ఎలా రాణించగలం? వాటన్నింటిని అధిగమించాలి అంటే మనం దేవుని మీద ఆధారపడాల్సిందే. అందుకే జ్ఞానియైన సొలోమోను "సోమరీ చీమల యొద్దకు వెళ్ళి వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము" అని చెబుతున్నాడు (సామెతలు 6:6-11).

### సోమరితనం వల్ల కలిగే నష్టాలు

చీమల ద్వారా సోమరులను హెచ్చరిస్తున్నాడు. సోమరికి వచ్చే ఫలం దారిద్ర్యం (సామె 6:11, 10:4), వెట్టి పనులు చేస్తాడు (సామె 12:24), వేటాడినా పట్టుకోలేడు (సామె 12:27), ఆశ పడతాడు కానీ ఏమీ దొరకదు (సామె 13:4), సోమరి చేతులు



పనిచేయనొల్లవు, వాని ఇచ్ఛ వానిని చంపును (సామె 21:25), నిద్రమత్తు చింపిగుడ్డలు ధరించుకొనుటకు కారణమవును (సామె 23:21), సోమరి మార్గము ముళ్ళకంచె (సామె 15:19), గాఢ నిద్రకలు గజేస్తుంది, పస్తులుంటాడు (సామె 19:15).

### కష్టపడడం వల్ల కలిగే లాభాలు

బుద్ధి కలిగి కష్టపడి శ్రద్ధగా పనిచేయడానికి వచ్చే ఫలం - వేసవి కాలమందు ఆహారం సిద్ధపరచుకుంటాడు. కోత కాలమందు ధాన్యం కూర్చుకుంటాడు, ఐశ్వర్యవంతుడవుతాడు, ఏలుబడి చేస్తాడు, చురుకుగా ఉంటాడు, రాజులయెదుట నిల ్వస్తాడు, శ్రేష్ఠులుగా ఉంటాడు, దేవుని నామానికి మహిమ తీసుకువస్తాడు.

### శక్తిలోపం లేకుండా కష్టపడు

కాబట్టి దేవుని పిల్లలుగా ఆలోచన చేద్దాం. పనికి కర్త దేవుడే, యేసుప్రభువు ఈ లోకంలో ఉన్నప్పుడు ఆయన కష్టపడి వడ్రంగి పనిచేసినట్లు చరిత్ర మనకు తెలియజేస్తుంది. మన రక్షణ కొరకు ఆయన ఎంతో కష్టపడ్డాడు. ఇప్పటికీ మానవుల రక్షణార్థమై ఆయన పనిచేస్తూనే ఉన్నాడు. విద్యార్థులుగా మీ జీవితం ఆశీర్వాదకరంగా ఉండాలని కోరుకుంటున్నారా? అయితే శక్తి లోపం లేకుండా నీవు పనిచేయాలని దేవుడు కోరుకుంటున్నాడు (ప్రసంగి 9 :10). ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ డిపార్ట్‌మెంట్, ఎంతో మంది మన గ్రాడ్యుయేట్స్, వారి కుటుంబాలు మీ భవిష్యత్ కొరకు ప్రార్థన చేస్తూ ఉన్నారు. మరి కష్టపడి నీ కెరీర్ కట్టుకోవడానికి, దేవుని చిత్త ప్రకారం మంచి ఉద్యోగంలో స్థిరపడడానికి నీవు సిద్ధమేనా? నీ నిర్ణయం ఏంటి?

**- డా. ఎమ్. సాల్మన్ రాజు**, వైజాగ్

# కాన్‌స్టాంటైన్ దర్శనం



*"ఈ గుర్తుతో నీవు జయిస్తావు".*
*కాన్‌స్టాంటైన్ చరిత్రను మార్చిన దర్శనం.*

## పరిచయం

తన మొదటి శతాబ్దాల కాలమంతా రోమా సామ్రాజ్యం నుండి ఊహించని శ్రమల గుండా సంఘం వెళ్ళింది. అయినప్పటికీ సంఘం ఎదిగింది, వ్యాపించింది. మూడు శతాబ్దాల శ్రమల తర్వాత స్వయాన రోమా చక్రవర్తే క్రైస్తవునిగా మారినప్పుడు పరిస్థితులు ఎంత అసాధారణంగా మారిపోయి ఉంటాయో ఊహించండి. క్రైస్తవులను అత్యంత క్రూరంగా హింసించిన రోమా సామ్రాజ్యం, ఒక వ్యక్తి జీవిత కాలంలోనే క్రైస్తవ్యాన్ని హత్తుకున్నది.

''ఈ గుర్తుతో నీవు జయిస్తావు'' అనే వాక్యం కాన్‌స్టాంటైన్ చక్రవర్తి మారుమనసును తెలియజేస్తుంది గాని, తన పరిపాలన విధానాలలో తన నూతన విశ్వాసం ప్రతిబింబించిందా, లేదా అనే విషయానికి సంబంధించిన తగిన సమాచారాన్ని ఇవ్వదు. నీవు క్రింద చదవబోతున్న విషయాలకు అదనంగా శిశుహత్యలను, బానిసలను, రైతులను వేధించడం, సిలువ మరణం వంటి వాటిని రద్దుచేసి, ఆదివారాన్ని సెలవుదినంగా ప్రకటించాడు.

పాలస్తీనాలోని సీజరయ అను పట్టణానికి బిషప్‌గా ఉన్న యూసిబియస్ రాసిన కాన్‌స్టాంటైన్ జీవితచరిత్ర పుస్తకంలో ఈ విషయాలన్నీ ఉన్నాయి. అతను గొప్ప చరిత్రకారుడు. సంఘచరిత్రను క్రోడీకరించడానికి విశేష కృషి చేసిన వారిలో అతను మొదటివాడు. అతను రాసిన ముఖ్యమైన పుస్తకాలలో "ద హిస్టరీ ఆఫ్ ద చర్చ్" ఒకటి. ఈ గ్రంథంలోని చరిత్రను సేకరించడానికి అతనికి 25 సం॥లు పట్టింది. కాన్‌స్టాంటైన్‌తో అతనికి వ్యక్తిగత పరిచయం కూడా ఉన్నది. కాబట్టి, అతను రాసిన చరిత్ర నమ్మదగినది. వ్యక్తిగతంగాను, రాజకీయపరంగాను అతను కాన్‌స్టాంటైన్‌కు పెద్ద అభిమాని. కాబట్టి, అతను రాసిన చరిత్రలో కొంత వ్యక్తిగత అభిమానాన్ని కూడా చూపించి ఉండవచ్చు.

## కాన్‌స్టాంటైన్ క్రైస్తవ్యాన్ని స్వీకరించడం

అప్పటి ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన రాజ్యాలలో రోమా సామ్రాజ్యం ఒకటి. యూదులకు, క్రైస్తవులకు వ్యతిరేకియైన రోమా చక్రవర్తులలో ఒకడైన కాన్‌స్టాంటైన్ 4వ శతాబ్దంలో రోమాను పరిపాలించాడు. ఇటలీ చక్రవర్తియైన మాక్సెంటస్ భయంకరమైన దుష్టశక్తులను, క్షుద్రశక్తులను ఆశ్రయిస్తూ ప్రజలను ఎంతో క్రూరంగా బాధించేవాడు. ప్రజలు ఆయన పెట్టే బాధల్ని తట్టుకోలేక కాన్‌స్టాంటైన్ దగ్గరకు వచ్చి రాజు బారినుంచి

కాపాడమని ప్రాధేయపడ్డారు. అప్పుడు చక్రవర్తి ఆ రాజుకు ఒక తాఖీదు పంపించాడు. దానికి ఆయన సరిగా స్పందించకపోవడంతో చక్రవర్తి యుద్ధం ప్రకటించాడు. ఈ యుద్ధంలో ఆయన మిలటరీ శక్తికన్నా ఎక్కువ శక్తి తనకు అవసరమనే దృఢనమ్మకం కాన్స్టాంటైన్‌లో కలిగింది. కాబట్టి, అతను దేవుని సహాయాన్ని కోరాడు. రక్షణ, సహాయాల కోసం ఏ దేవుని మీద ఆధారపడాలి అని అతను ఆలోచించాడు. తనకుముందున్న అనేకమంది చక్రవర్తులు అనేకమంది దేవుళ్ళ మీద ఆధారపడి, వారిని సేవించి, బలులు అర్పించారు. పొగడ్తలతో కూడిన ప్రవచనాలు, వాక్కులు ఆయా దేవుళ్ళ పూజారుల నుండి పొంది, చివరకు మోసపోయారు, భయంకరమైన అంతాన్ని వారు చవి చూశారు. పరలోకం నుండి వచ్చే ఉగ్రత గురించి ఏ ఒక్క దేవుడు కూడా వారిని హెచ్చరించలేదు. వారి తప్పులను ఖండిస్తూ, తన జీవితాంతం సార్వభౌముడైన దేవునిని మొక్కిన తన తండ్రి దేవుడే తన రాజ్యానికి (రోమా సామ్రాజ్య తూర్పు ప్రాంతం) రక్షకుడని భావించాడు. దేవుళ్ళు కాని వారిని ఆరాధించడం తెలివి తక్కువతనమని అతను నిర్ణయించుకొన్నాడు. ఈ కారణాన్ని బట్టి తన తండ్రి దేవుని గౌరవించడానికి బద్ధుడైయుండుట ఉత్తమమని అతను భావించాడు.

## కాన్స్టాంటైన్ దర్శనం

తాను ఎవరో ప్రత్యక్షం చేయమని, ప్రస్తుతం తనకు ఉన్న కష్టాన్ని తొలగించమని దేవునికి కాన్స్టాంటైన్ మొరపెట్టాడు. అతను ఈవిధంగా తీవ్ర ఆసక్తితో ప్రార్థిస్తుండగా, పరలోకం నుండి అత్యంత అసాధారణమైన గుర్తు ఒకటి కనిపించింది. ఈ గుర్తు దర్శనంలో ఇంకెవరు చెప్పినా ఎవరూ నమ్మేవారు కాదేమో. అయితే, ఈ చరిత్ర రాసిన రచయితకు



స్వయాన చక్రవర్తే ఈ విషయాన్ని చెప్పినదానిని బట్టి, ఈ విషయాన్ని తానే స్వయంగా నిర్ధారించుకున్న దానిని బట్టి దీనిని నమ్మకుండా ఎవరు ఉండగలరు. మధ్యాహ్న సమయంలో, ఆకాశంలో, సూర్యునికి పైన గొప్ప వెలుగుతో సిలువ గుర్తు అతనికి కనిపించింది. ఆ సిలువ క్రింద ఈ మాటలు ఉన్నాయి: "ఈ గుర్తుతో నీవు జయిస్తావు". అది చూడగానే అతను గొప్ప ఆశ్చర్యానికి లోనయ్యాడు. అతని సైన్యమంతా ఈ అద్భుత దృశ్యాన్ని చూసింది. ఈ గుర్తు ఏమిటో అతనికి అర్థం కాలేదు. దీని గూర్చి ఆలోచిస్తూ అతను రాత్రి నిద్రపోయాడు. మధ్యాహ్నం అతను చూసిన గుర్తుతో యేసుక్రీస్తు అతనికి కలలో కనిపించాడు. ఇలాంటి దాన్ని ఒకటి తయారు చేయించుకొని, తాను చేసే యుద్ధాలన్నిటిలో ఒక రక్షణ కవచంగా దాన్ని ఉపయోగించమని ఆజ్ఞాపించాడు.

## సిలువ గుర్తును తయారు చేయించుట

ఉదయాన్నే అతను నిద్ర మేల్కొని, తాను పొందిన అద్భుత కల గురించి తన స్నేహితులకు చెప్పాడు. తర్వాత కంసాలి వాళ్ళను పిలిపించి, తాను చూసిన ఆ గుర్తును పోలిన గుర్తును బంగారం, విలువైన రాళ్ళతో పొదిగించి తయారు చేయించాడు.

## సిలువ రూపం



సిలువను క్రింద సూచించిన విధంగా తయారు చేయించడం జరిగింది. ఒక పొడవాటి దిమ్మకు బంగారు రేకు పొదిగారు. బంగారు రేకు తొడిగిన మరొక చిన్న దిమ్మను మొదటి దిమ్మె పైభాగాన అడ్డంగా అమర్చడం జరిగింది. బంగారు హారముతో తయారుచేసి, వెలగల రాళ్ళతో పొదిగిన ఒక హారాన్ని ఆ సిలువ పైభాగాన అమర్చారు. ఆ హారము మధ్యలో గ్రీకు భాషలో యేసుక్రీస్తు పేరుతో ఉన్న మొదటి రెండు అక్షరాలను పొదిగారు (ఆ రెండు అక్షరాలు ఆంగ్ల అక్షరాలైన (X, P) ల వలె కనిపిస్తాయి). తర్వాత రోజుల్లో చక్రవర్తి ఈ రెండు అక్షరాలను తన హెల్మెట్‌పై ధరించాడు. అత్యంత ప్రశస్తమైన వెలగల రాళ్ళతో పొదగబడి, రాజరికానికి గుర్తుగా ఉండే ఒక వస్త్రం సిలువ నిలువ కమ్మి

పైభాగం నుండి వేలాడుతుంది. ఆ వస్త్రం అంచులు బంగారు దారాలతో నేశారు. ఇది చూడడానికి చాలా అందంగా ఉంటుంది. ఈ వస్త్రం పైభాగంలో బంగారు వర్ణంతో చక్రవర్తి, అతని పిల్లల బొమ్మలు ముద్రించి ఉంటాయి. తనకు విరుద్ధమైన పరిస్థితుల న్నిటిని సిలువగుర్తును చేతపట్టుకొని ఎదుర్కొనేవాడు. తాము చేయబోయే ప్రతి యుద్ధంలో సిలువ గుర్తులను తీసుకువెళ్ళాలని ఇతరులకు ఆజ్ఞాపించాడు.

## కాన్‌స్టాంటైన్ సంఘంచేత బోధించబడుట

తనకు కలిగిన అద్భుతమైన దర్శనం తర్వాత, తనకు దర్శనమైన దేవుని తప్ప మరి ఏ దేవునిని ఆరాధించనని తీర్మానం చేసుకున్న తర్వాత, ఆ దేవునికి సంబంధించిన సత్యాలు, మర్మాలు తెలిసిన వ్యక్తులను పిలిపించుకున్నాడు. ఆ దేవుడు ఎవరో, దర్శనం అర్థం ఏంటో తెలుసుకోవాలనుకున్నాడు. ఆయన దేవుడని, దేవుని కుమారుడని, తనకు దర్శనంలో కనిపించిన గుర్తు అనైతికతకు చిహ్నమని, అయితే, ఆయన ఈ భూలోకానికి వచ్చి, ఆ గుర్తు ఆకారంలో ఉన్న సిలువపై మరణించి తిరిగి లేచిన తర్వాత అది విజయానికి చిహ్నంగా మారిందని వారు అతనికి తెలియజేశారు. యేసుక్రీస్తు మానవునిగా ఈ లోకంలో జన్మించిన విధానాన్ని వారు అతనికి వివరించారు. తనకు కనిపించిన ఆ దైవప్రత్యక్షత పట్ల కాన్‌స్టాంటైన్‌కు గొప్ప గౌరవ భావం కలిగింది. తనకు కలిగిన దర్శనాన్ని, వారు వివరించిన విషయాలతో పోల్చి నిర్ధారణ చేసుకున్నాడు. ఈ జ్ఞానం తనకు దేవుడే అనుగ్రహించాడని విశ్వసించిన అతను పరి శుద్ధ లేఖనాలను చదవడానికి తీర్మానించుకున్నాడు. అంతేకాదు, దేవుని సేవకులను తనకు సల హాదారులుగా నియమించుకున్నాడు. తనను తాను సంపూర్ణంగా ఆయనకు సమర్పించుకోవడం ద్వారా, తనకు దర్శనమైన దేవునిని గౌరవించడం తన బాధ్యత అని అతను భావించాడు. దేవునియందు తనకు కలిగిన ఈ నిరీక్షణతో బలము పొందినవాడై నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడడానికి త్వరగా వెళ్ళాడు.

## బిషప్‌లను గౌరవించడం, చర్చ్‌లు నిర్మించడం

తనతో సహవాసం చేయమని దేవుని సేవకుల ను చక్రవర్తి తానే స్వయంగా ఆహ్వానించేవాడు. తన దేవుని సేవకు తమను తాము సమర్పించుకున్న




వ్యక్తులుగా వారిని భావించి, వారిని ఎంతో గౌరవించాడు. ఆ సేవకులు సాధారణ వస్త్రధారణలో ఉన్నప్పటికీ తన భోజనపుబల్ల వద్ద భోజనం చేసే అవకాశాన్ని అతను వారికి ఇచ్చాడు. ఎందుకంటే, వారి పైరూపాన్ని అతను పట్టించుకోలేదు. వారిలో ఉన్న దేవునిని అతను గౌరవించాడు. చర్చ్ నిర్మాణాల కోసం, ఆధునికీకరణ కోసం అతను తన స్వంత నిధిలో నుండి విస్తారమైన ధనాన్ని ఇచ్చాడు. అవసరంలో ఉన్న వారికి, వారు క్రైస్తవేతరులైనా సరే, ఎంతో విస్తారమైన ధన సహాయాన్ని చేసేవాడు. దిక్కులేని వారికి, భిక్షగాళ్ళకు ఆహారాన్ని, వస్త్రాలను సమకూర్చేవాడు. తన ఆస్తిని పోగొట్టుకున్న వారిపట్ల అతను ఇంకా ఉదారంగా వ్యవహరించేవాడు.

## బిషప్పుల సదస్సులో కాన్‌స్టాంటైన్

దేవుని సంఘం పట్ల కూడా అతను శ్రద్ధను కనుపరచాడు. ఆయా ప్రాంతాల్లోని సంఘాలు కొన్ని లేఖన సత్యాలపట్ల విభేదించినప్పుడు, వాటిని నివృత్తి చేయడానికి కాన్‌స్టాంటైన్ సదస్సులు ఏర్పాటు చేసేవాడు. వారిలో ఒకడిగా ఆ చర్చ్‌ల్లో వారితో పాల్గొనేవాడు. తన దేహ సంరక్షకులను, సైనికుల ను అతను కాదనుకొనేవాడు. దేవుని భయమే తనను రక్షిస్తుందని అతను నమ్మాడు. తన చుట్టూ ఉన్న నమ్మకమైన తన స్నేహితులే తనకు రక్షణ అని భావించాడు. మంచి ఆలోచనాపరులు, సహన శీలురు, సమాధానపరిచేవారు, మంచి నిర్ణయాలు తీసుకొనేవారు చక్రవర్తి నుండి ఉన్నత గౌరవాన్ని పొందేవారు. వితండవాదం చేసే వారిని ఆయన ఏ మాత్రం కనికరించేవాడు కాదు.

సేకరణ: christianhistoryinstitute.org

అనువాదం: పి. రామస్వామి



# కుటుంబంలో నాయకత్వం

## ఉపోద్ఘాతం

దేవుడు కుటుంబ వ్యవస్థను ఉనికిలోకి తెచ్చినప్పుడు, కుటుంబంలోని ప్రధాన వ్యక్తులైన భర్తకు, భార్యకు వారి వారి పాత్రలను కూడా స్పష్టంగా తన వాక్యంలో వ్యక్తపరిచాడు. కుటుంబం దేవుని మానస పుత్రిక. అందుకే కుటుంబానికి కావల సిన ప్రతి ఉపదేశం, హెచ్చరిక దేవుని వాక్యములో వివరించబడింది. దేవుని వాక్యానికి వేరుగా ఉండే ఏ సిద్ధాంతమైనా కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తుంది. అందువలన దేవుని వాక్యమును సరిగా అన్వయించుకొని దానిని జీవితానికి మార్గదర్శకంగా అనుకరించుట తప్పనిసరి.

## ప్రారంభం

దేవుడు ఆదాము హవ్వలను సృజించి వారిని భర్త, భార్యలుగా నియమించినప్పుడు నాయకత్వం గురించి ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు గాని ఆదికాండం2:24 లో కుటుంబానికి ఇచ్చిన ప్రథమ ఆజ్ఞలో అది అంతర్గతంగా చెప్పబడింది. భార్యాభర్తలిద్దరూ తమ తల్లిదండ్రులను విడిచి ఒకరిని ఒకరు హత్తుకొని ఏకత్వంలో పాలుపంచుకొను వ్యవస్థలో నాయకుని ప్రస్తావన, అవసరత ఉన్నప్పటికీ పాపము ఉనికిలో లేని ఆ కాలంలో దైవిక ప్రేమతో ప్రేమించి, సంరక్షించి నడిపించే నాయకునికి అది దైవ నిర్ణయ బాధ్యత గాను, హవ్వకు దానిని సంపూర్ణ విధేయతతో స్వీకరించు నియమంగానూ కొనసాగింది. అయితే పాపము ఆ అద్భుత వ్యవస్థను పాడు చేసినట్లు ఆదికాండం 3:16లో గమనించగలము. "ఆయన స్త్రీతో నీ ప్రయాసమును, నీ గర్భ వేదనను నేను మిక్కిలి హెచ్చించెదను. వేదనతో పిల్లలను కందువు, నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును, అతడు నిన్ను ఏలును" అని చెప్పెను. "నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును అతడు నిన్ను ఏలును" అనే వాక్యానికి సరైన అర్థమును గ్రహించడానికి ఆదికాండం 4:7 లోని వాక్యాన్ని గ్రహించాలి. ఎందుకంటే అక్కడ కూడా అవే మాటలు వాడబడ్డాయి.

"వాకిట పాపం పొంచి ఉండును, నీ యెడల దానికి వాంఛ కలుగును నీవు దానిని ఏలుదువు అనెను". స్త్రీలోని పాపము తన భర్తను తన స్వాధీనంలో ఉంచుకొని, అతనిని తన స్వకీయ ఆశలకు, లాభానికి వాడుకోడానికి ప్రయత్నిస్తుంది. అదేవిధంగా పురుషుల్లోని పాపము స్త్రీని స్వాధీనం చేసుకొని ఆమెను తన స్వకీయ లాభము కొరకు, ఆశల కొరకు వాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ విధంగా ఆదికాండం 3:16లోని శాపం లేక శిక్ష స్త్రీ పురుషుల మధ్య ఏర్పడిన అధికార పోరుకు

**దేవుని వాక్యం ఎరిగి కూడా దానికి తప్పుడు భాష్యం అంటగట్టి ఆధునిక యుగంలో తలెత్తుతున్న వివిధ రకాల వింత పోకడలకు ఫెమినిజం, స్త్రీ స్వాతంత్ర్యం మొదలగు భావాజాలానికి లోనై, దేవుని క్రమాన్ని విస్మరించే విశ్వాసులను మన యుఇయస్ఐ కుటుంబాల్లో కూడా గమనించగలం. వీరి బోధల్లో ఉమ్మడి నాయకత్వం, సమాన నాయకత్వం, స్వేచ్ఛా నాయకత్వం మొదలగు దైవ వాక్య విరోధ బోధలతో కూడిన నాయకత్వములను చొప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.**

నాంది పలికింది. దీనిని చరిత్రలో మనం స్పష్టంగా చూడగలము. దేవుడు సృజించిన పురుషత్వం స్త్రీత్వం పాపము చేత పాడు చేయబడి తమ సహజ రూపాన్ని కోల్పోయాయి. తద్వారా స్త్రీ స్వాతంత్ర్యం పురుషాధిక్యతలనే భావాజాలం ఉనికిలోకి వచ్చాయి.

## విమోచించబడిన కుటుంబం

క్రీస్తు ప్రభువు రాకతో పాపం వలన పాడు చేయబడిన కుటుంబ వ్యవస్థ తిరిగి దేవుని ప్రణాళికలోకి రావడానికి వీలు కలిగింది. పాపము నుండి విమోచించబడిన స్త్రీ పురుషులు మాత్రమే దేవుడు ఏర్పరచిన అసలైన కుటుంబ వ్యవస్థను అనుభవించడానికి, తద్వారా దేవుని ప్రణాళిక నెరవేర్చడానికి సాధ్యపరచగలరు. పాపము ద్వారా కుటుంబ వ్యవస్థలోకి ప్రవేశించిన వివిధ తప్పుడు సిద్ధాంతాలను అధిగమించి దేవుని చిత్తాన్ని నెరవేర్చగలరు.

కుటుంబ విషయంలో భర్త నాయకత్వం గూర్చి దేవుని నిత్య సంకల్పానికి సంబంధించిన వివరణ కొత్త నిబంధనలో అనేకచోట్ల గమనించగలం (1 కొరింథీ 11:3,8; ఎఫెసీ 5:23; కొలస్సీ 3:18



మొ॥). కుటుంబంలో భర్త నాయకత్వం మానవుల అనుకూలతను బట్టి నిర్ణయింపబడింది కాదు, అది దైవిక క్రమం. స్త్రీ పురుషులు ఇద్దరికీ దేవుడు సమాన అంతస్తును అనుగ్రహించాడు. కానీ బాధ్యతలలో వారు భిన్నత్వం కలవారు. ఈ నాయకత్వం, లోబడడం అను ప్రక్రియలు కుటుంబ వ్యవస్థను సజావుగా కొనసాగించడానికి అవసరమైన నిర్వహణ బాధ్యతలుగా చూడాలి.

## నాయకత్వం ఒక బాధ్యత

నాయకత్వం ఒక ఆధిక్యతగా గాక అది దేవుడు అప్పగించిన గురుతర బాధ్యతగా చూడాలి. ఈ బాధ్యతలో భర్త తప్పిపోతే దేవుని ఆజ్ఞను ఉల్లంఘించి పాపం చేసిన వాడుగాను, తన బాధ్యతను విస్మరించిన వానిగాను, దేవునికి లెక్క అప్ప చెప్పవలసిన వాడుగాను ఉంటాడు. కొందరు భర్తలు నియంతల వంటి నాయకులుగా ప్రవర్తిస్తారు. వారి మాటే చెల్లుబడి కావాలి. వారికి ఎదురు చెప్పడానికి వీల్లేదు, ఎవరి సలహా వారికి అక్కర్లేదు. మరికొందరు సైనికాధికారుల్లాగా అరుపులు, కేకలతో ఆజ్ఞలు జారీ చేసి తమ నాయకత్వాన్ని సాగిస్తారు. ఇలాంటి నాయకత్వం దేవుని వాక్యం అనుమతించదు. ఇది పాప సంబంధమైన నాయకత్వం.

బాధ్యతాయుతమైన దైవిక నాయకత్వంలో అత్యున్నతమైన దైవిక ప్రేమ ఉంటుంది. ఆ ఇంటిలో భార్యను పిల్లలను సంబోధించే విధానంలో, వారికి క్రమశిక్షణ నేర్పించే విషయంలో కూడా ప్రేమ ఉట్టిపడుతుంది. తప్పు సరిదిద్దే ప్రయత్నంలో కూడా ఎఫెసీ 4:15లో చెప్పినట్లు "ప్రేమతో సత్యం చెప్పుచు" అన్నట్లు ఉంటుంది. రాజీ పడని స్థిర నిర్ణయాలను దైవప్రేమతో మృదువుగా వ్యక్త పరచడం జరుగుతుంది. భర్త ప్రాథమిక ధర్మం తన భార్యను తనకు లోబడేటట్లు చేయడం కాదు, కానీ ఆమెను

అత్యున్నతమైన దైవిక ప్రేమతో ప్రేమించడమే. ఏ మానవుడు దేవుని సహాయం లేకుండా తన భార్యను దైవిక ప్రేమతో ప్రేమించలేడు, ఎందుకంటే ప్రేమ దేవుని మూలంగా కలుగుచున్నది (1 యోహాను 4:7)

ప్రతి భర్తలోని పాప స్వభావం నుండి వెలువడే పురుషాధిక్యత గుణం, పురుషాహంకారం తన భార్యను దైవిక ప్రేమతో ప్రేమించడానికి ఇష్టపడదు సరి కదా, పెత్తనం చేయడానికి, తన ఆధిపత్యం సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తుంది. అందువలన ప్రతి భర్త తన విద్యుక్త ధర్మమైన కుటుంబ నాయకత్వం సమర్థవంతంగా నిర్వహించడానికి తాను అసమర్థుడని గ్రహించి దేవుని ప్రేమ కొరకు నిరంతరం ఆర్థించి, ఆ ప్రేమతో తన నాయకత్వాన్ని నిర్వహించినప్పుడు, ఆ భర్తకు భార్య ఇష్టపూర్వకంగా లోబడుతుంది.

నాయకత్వపు బాధ్యత నిర్వహించే ప్రతి భర్త గుర్తుంచుకోవాల్సిన ప్రాముఖ్యమైన విషయం ఏంటంటే, తనకు శిరస్సు అనగా నాయకుడు, ఆలోచనకర్త, ప్రభువు యేసే! (1 కొరింథీ 11:3). ప్రభువు అధికారానికి సంపూర్తిగా లోబడే భర్త అధికారంలో భార్య చాలా భద్రతా భావం అనుభవిస్తుంది. అతని నాయకత్వం గృహ వాతావరణాన్ని మార్చివేస్తుంది. అక్కడ పెత్తనం చెలాయించడం, ఆధిపత్య పోరాటాలు, అంతస్తులు కోసం ఆరాటాలు ఉండవు. కేవలం దేవుడిచ్చిన బాధ్యత నిర్వహణ కోసమైన తాపత్రయం మాత్రమే ఉంటుంది.

## భర్త నాయకత్వం అంటే అర్థం ఏంటి?

### 1. భర్త గృహంలో నిర్ణయాలకు బాధ్యత వహించాలి

భర్తను దేవుని వాక్యంలో శిరస్సుతో పోల్చారు. శిరస్సులో ఆలోచనలు, నిర్ణయాలు జరుగుతాయి. మంచి నాయకుడు మంచి ఆలోచనా పరుడుగాను, నిర్ణయాలు తీసుకొనే వాడుగాను ఉండాలి. చాలామంది భర్తలు ఈ బాధ్యతను తమ భార్యలకు వదిలి వేస్తారు. మరికొందరు ఎవరికీ చెప్పకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటారు. ఈ రెండూ దేవునికి అంగీకార యోగ్యం కావు. కుటుంబానికి సంబంధించిన నిర్ణయాలు ఉదా: ఇంటి అద్దె ఎంత చెల్లించాలి? ఎంతమంది పిల్లలకు న్యాయం




జరిగించగలం? పెట్టుబడులకు సంబంధించిన ప్రణాళికలు, స్థిర చరాస్తుల విషయాలు మొదలైనవి. భార్యాభర్త లిరువురు సంప్రదించుకొని ఏది కుటుంబానికి మేలుకరమో వాటిని నిర్ణయించాలి. ఆ నిర్ణయం ఎవరిదైనా కూడా దేవుడు దాన్ని భర్త నిర్ణయంగా ఎంచుతాడు. అందువలన భర్త దేవుని వాక్యంతో తన మనసు నింపుకొని వాక్య విరోధమైన నిర్ణయాలకు తావు ఇవ్వకూడదు.

### 2. భార్యకు, కుటుంబానికి ముందుండి నడిపించాలి

ఒక నాయకుని ప్రాముఖ్య బాధ్యత ముందుండి నడిపించడం. కుటుంబానికి మార్గ నిర్దేశం చేయాలి. కుటుంబంలోని ప్రతి ఒక్కరి అక్కర్లను గుర్తించి వాటిని తీర్చగలగాలి. కుటుంబంలోని ఆత్మీయ వాతావరణం భర్త మీద ఆధారపడి ఉంటుంది. భార్య భర్తను ఒక ఆత్మీయ నాయకునిగా చూడగలగాలి. కుటుంబ ప్రార్థన విషయంలోనూ, సంఘ ఆరాధన కార్యక్రమానికి క్రమం తప్పకుండా, సమయానికి వెళ్ళేటట్లు ప్రోత్సహించే నాయకునిగా ఉండాలి. కుటుంబంలోని విలువలు, సాంప్రదాయాలు, పద్ధతులు దైవ వాక్య క్రమంలో ఉండేటట్లు గమనించే నాయకుడై ఉండాలి.

### 3. మాదిరి

నాయకుడు కుటుంబానికి ఒక మాదిరి. తాను

చేయని దాన్ని తన కుటుంబం అనుసరించాలని ఆశించే మూర్ఖునిగా ఉండకూడదు. ఉదయాన్నే లేచి దేవునితో సమయం గడపడం, ప్రార్థన, దైవవాక్య పఠనలలో కుటుంబానికి మాదిరిగా ఉండాలి. తన విలువలు, ప్రాధాన్యతలు దేవుని వాక్య పరిధిలో ఉంచుకోవాలి. తన ప్రవర్తన, మాటలు, అలవాట్లు తన పిల్లల మనస్తత్వంపై గొప్ప ప్రభావం చూపిస్తాయని ఎరిగి ఇంటిలో తన సాక్ష్యం కాపాడుకోవాలి.

### 4. కాపుదల

భర్త నాయకత్వం భార్యకు కుటుంబానికి గొప్ప కాపుదల, సంరక్షణ ఇవ్వాలి. భౌతిక మానసిక ఆత్మీయ రంగాలలో భార్యకు బిడ్డలకు భర్త కాపుదల ఉండాలి. ఇరుగు పొరుగువారు, అత్తామామలు, ఆడపడుచుల నుండి కలిగే మానసిక ఒత్తిడి, ఉద్యోగ స్థలములో, తోటి ఉద్యోగుల నుండి కలిగే మానసిక, భావోద్రేక, హింస నుండి ఆదరణ ఇచ్చే నాయకునిగా రుజువు చేసుకోవాలి. అక్కడక్కడ యుఇయస్ఐ గ్రాడ్యుయేట్స్ కుటుంబాల్లో గృహహింస చోటు చేసుకోవడం దు:ఖకరం.

### భర్త తన నాయకత్వం నిర్వహించలేక పోవడానికి కొన్ని కారణాలు

1. భర్త పెంపకంలో చిన్ననాటి అనుభవాల ప్రభావం: ఆ వ్యక్తి తల్లిదండ్రులు నేపథ్యంలో ఒకవేళ అతని తల్లి తన భర్త నాయకత్వాన్ని హరించి తనే కుటుంబ పాలన జరిగిస్తే కుమారుని మనస్తత్వం మీద అది చాలా చెడు ప్రభావం చూపిస్తుంది. ఈ కారణం చేత భర్త తనకు తెలియకుండానే కుటుంబ విషయంలో తన తండ్రి వలె నాయకత్వాన్ని నిర్వర్తించడానికి ఇష్టపడకపోవచ్చు.
2. భార్య నేపథ్యంలో ఆమె తల్లి తన భర్తపై పెత్తనం చేసే వ్యక్తి అయ్యుంటే ఆ ప్రభావం ఆమె మనసు మీద ఉంటుంది. తాను కూడా తన భర్త నాయకత్వాన్ని దోచుకుని పెత్తనం చేసే భార్యగా మారవచ్చు.
3. పాపమును అనుమతించినప్పుడు ఆదికాండం 3:16 లో చెప్పినట్లు అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకోవాలనే కోరికతో భార్య, భార్యను ఒక దాసి లాగా, పనికిరాని వ్యక్తి లాగా వ్యవహరించే భర్తలాగా మారి దేవుని బాధ్యతను విస్మరించడం జరగవచ్చు.
4. దేవుని వాక్యం ఎరిగి కూడా దానికి తప్పుడు భాష్యం అంటగట్టి ఆధునిక యుగంలో తలెత్తుతున్న వివిధ రకాల వింత పోకడలకు ఫెమినిజం, స్త్రీ స్వాతంత్ర్యం మొదలగు భావాజాలానికి లోనై, దేవుని క్రమాన్ని విస్మరించే విశ్వాసులను మన యుఇయస్ఐ కుటుంబాల్లో కూడా గమనించగలం. వీరి బోధల్లో ఉమ్మడి నాయకత్వం, సమాన నాయకత్వం, స్వేచ్ఛా నాయకత్వం మొదలగు దైవ వాక్య విరోధ బోధలతో కూడిన నాయకత్వాలను చొప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### ముగింపు

దేవుని వాక్యపు వెలుగులో భర్త కుటుంబానికి నాయకుడు. అయితే ఈ నాయకత్వం ఎంతో బాధ్యతాయుతమైన, ప్రేమ పూర్వక నాయకత్వంగా ఎంచబడుతుంది కానీ పెత్తనం చేయడం, భార్య మనసును, వ్యక్తిత్వాన్ని కించపరిచేది కాకూడదు. ఈ నాయకత్వం సంఘం మీద ప్రభువు చూపించే ప్రేమ పూర్వక నాయకత్వపు మాదిరిని గుర్తు చేస్తుంది. ప్రభువు తనకు వధువుగా ఇవ్వబడిన సంఘము విషయమై ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నాడో ఎఫెసి 5:22-27లో చూడగలం. సంఘము ఆయనను లెక్క చేయకుండా అవిధేయరాలైనప్పటికీ కూడా ఆయన చూపిన దీర్ఘ శాంతము, ప్రేమ, సహనము ప్రకటన 3:17-21లో చూడగలము. తన దృష్టిలోపాన్ని సరి చేయడానికి తన దగ్గర మందు ఉన్నదని, తన ఆత్మీయ దారిద్ర్యాన్ని తొలగించడానికి తన దగ్గర ధనము సమృద్ధిగా ఉందని, మనసు మార్చుకొని తన దగ్గరకు వస్తే తిరిగి తనతో కలిసి భోజన సహవాసం కలిగి ఉండవచ్చని, తానింకా ఆమెను ప్రేమిస్తున్నానని, విలువలు మార్చుకొనని భర్తగా, సాత్వికుడైన భర్తగా, ప్రేమ గల భర్తగా ఆమెను బతిమాలుతున్న దైవ నరుని నాయకత్వం భర్తలైన వారందరికీ స్ఫూర్తి. ఈ నాయకత్వాన్ని యుఇయస్ఐలో ఉన్న వందలాది భర్తలు కలిగి ఉండాలని ఆ ప్రభువు కోరిక.

– కె. దేవిడ్ రాజ్ కుమార్, గుంటూరు



కథానిక

# సమయాన్ని సద్వినియోగం చేసుకో

వినయ్, ప్రవీణ్, శ్రీకాంత్ ముగ్గురూ ఇయు విద్యార్థులు. అంతమాత్రమే కాదు, రాబోయే విద్యా సంవత్సరానికి కాబోయే కమిటీ మెంబర్స్. ఒకే ఇంజనీరింగ్ కాలేజ్‌లో వేర్వేరు బ్రాంచ్‌లలో మూడవ సంవత్సరం చదువుతున్నారు. ఇంకో పది రోజుల్లో సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయి. విశ్వాస విద్యార్థులే కానీ ముగ్గురూ కూడా ఐపియల్ టీమ్స్‌కి కెప్టెన్స్‌లా ఫీల్ ఆయ్యే వీరాభిమానులు.

రాత్రంతా కొంచెంసేపు చదువు, కొంచెంసేపు ఐపియల్ స్కోర్ చూడడం. రాత్రి ఒంటిగంట దాటింది. మరలా పొద్దున్నే లేచి చదువుతో కుస్తీపట్లు, కునికి పాట్లు.

'అరేయ్, ప్రవీణ్' నిద్ర లేవరా, టైమ్ ఎనిమిది గం॥ అవుతుంది. మరో పది రోజుల్లో పరీక్షలు ఉన్నవి కదరా, లేచి చదువుకో' అంటూ శ్రీకాంత్ అరగంట నుండి ప్రవీణ్‌ను నిద్రలేపడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

"ఏం ఫర్వాలేదు లేరా! నీవు, నీ ఛాదస్తం." అంటూ ఇంకా ముడుచుకొని పండుకొన్నాడు ప్రవీణ్.

వినయ్ మరో మూలలో బైబిల్ ముందు కూర్చొని గంట నుంచి ఏం చేస్తున్నాడో అర్థం కావడం లేదు. బైబిల్, నోట్స్ మాత్రం తెరిచి, కళ్ళు మాత్రం మూసుకొని ఉన్నాయి.

ఒక గంట తర్వాత...

వినయ్, "శ్రీకాంత్, టైమ్ తొమ్మిది అవుతుంది. టిఫిన్ తెచ్చాను. ప్రవీణ్ నిద్ర లేచిన తర్వాత ఇద్దరూ కలిసి తినండి. రామకృష్ణ అన్న ఫోన్ చేశాడు. పదవ తరగతి, ఇంటర్ వాళ్ళకి గాస్పల్ మీటింగ్ గురించి మాట్లాడడానికి రమ్మన్నాడు. సమ్మర్ సెలవులు కదా, మరలా స్టూడెంట్స్ అందుబాటులో ఉండరని చెప్పాడు" అంటూ బయటికి వెళ్ళాడు.

అతి కష్టంమీద ఓ అరగంటకి ఇద్దరూ కలిసి టిఫిన్ చేశారు. చదువుకుందామని శ్రీకాంత్, ప్రవీణ్ బుక్స్ ముందేసుకొని కూర్చొన్నారు. ఇంతలో ప్రవీణ్‌కి ఫోన్ వచ్చింది. శ్రీకాంత్‌కు ఫ్రెండ్ వచ్చాడు. అంతే సంగతులు. మధ్యాహ్నం పన్నెండు గంటలు అయ్యింది. కుక్కర్‌లో రైస్ పెట్టి, కర్రీస్ తీసుకురమ్మని వినయ్‌కి ఫోన్ చేశారు.

శ్రీకాంత్ అరగంటలో వస్తానని చెప్పి ఫ్రెండ్‌తో బయటికి వెళ్ళాడు. ఒంటరిగా ఉన్న ప్రవీణ్, భోజనం చేసిన తర్వాత చదువుకొందాంలే అని ఫోన్ తెరిచాడు.

మధ్యాహ్నం ఒంటిగంట అయ్యింది. శ్రీకాంత్,

వినయ్ ఇద్దరూ రాలేదు. ప్రవీణ్‌కి ఏం చేయాలో అర్థం గాక, అక్కడ షెల్ఫ్‌లో ఉన్న విద్యార్థిజ్వాల మ్యాగజైన్ తీసి చదవసాగాడు. అందులో 'సమయమును పోనియ్యక సద్వినియోగం చేసుకొండి' అనే ఆర్టికల్ చదివాడు. ఆ ఆర్టికల్ చదువుతుంటే తన కోసమే అన్నట్లుగా, తన హృదయాన్ని బలంగా తాకినట్లు అనిపించింది. దేవుని బిడ్డననే విషయం మరచి ఎలా సమయాన్ని వ్యర్థం చేస్తున్నాడో, చదువు పేరుతో తల్లిదండ్రులను ఎలా మోసం చేస్తున్నాడో ఒక్కసారిగా గుర్తుకు వచ్చింది.

కొద్దిసేపటికి శ్రీకాంత్, వినయ్‌లు వచ్చారు. కలిసి భోజనం చేస్తుండగా ప్రవీణ్ కొంచెం ముభావంగా ఉన్నాడు. 'ఏమైంది ప్రవీణ్' అంటూ అడిగాడు శ్రీకాంత్. 'ఏమి లేదులే' అంటూ భోజనం త్వరగా ముగించాడు.

మధ్యాహ్నం మూడు గంటలు అయ్యింది. సుధీర్ అన్న, మరో యంగ్ గ్రాడ్యుయేట్ ఆక్వాలో డ్యూటీ ముగించుకొని వీరితో కలిశారు. ప్రవీణ్ చదవాలని కూర్చొన్నాడు. ప్రక్కనే గురక శబ్దం వినిపిస్తుంది. అందరూ మంచి నిద్రలో ఉన్నారు. ఏమీ చేయలేక తాను కూడా వారితో నిద్రపోయాడు.

సాయంత్రం అందరూ కలిసి తమ రూమ్ ప్రక్కనే ఉన్న జాషువ అన్న ఇంటికి వెళ్ళారు. అక్క టీ పెట్టి ఇచ్చింది. అవీ ఇవీ మాట్లాడుకొనే సరికి ఆరు గంటలు అయ్యింది. అందరూ బయట కర్రీస్ పాయింట్‌లో కర్రీస్ తీసుకొని రూమ్‌కి వచ్చి భోజనం చేసి బుక్స్ ముందేసుకొని కూర్చొన్నారు. ప్రవీణ్ ముభావంగానే ఉన్నాడు. ప్రవీణ్‌ని చూసి తట్టుకోలేక వినయ్ గట్టిగా అడిగాడు.

ప్రవీణ్ "మనమెందుకో సరిగా లేము అనిపిస్తుంది, తప్పుడు మార్గంలో ఉన్నట్లు ఉంది" అని అన్నాడు.

వెంటనే శ్రీకాంత్ 'మర్మాలు, మరమరాలు కాకుండా అసలు మ్యాటర్ చెప్పు" అంటూ రెట్టించి అడిగాడు.

వినయ్ కలుగజేసుకొని "నాకు తెలిసి ఈ రోజు అంతా బాగానే ఉన్నాము కదా? పాపం ఏ మైనా చేశామా? చూశామా?" అంటూ కొంచెం అసహనంగా అడిగాడు.

ప్రవీణ్ "మనకు పరీక్షలు కొద్ది రోజుల్లో ఉన్నాయన్న భయం ఏమాత్రం లేదు, మన సమయాన్ని మొత్తం వ్యర్థం చేస్తున్నాం. ఇలాగైతే పరీక్షల్లో పాసవ్వడం ఎలా? కెరీర్‌లో సెటిలవ్వడం ఎలా? భవిష్యత్ గురించి ఆలోచిస్తేనే భయం వేస్తుంది" అని చెబుతుంటే...

శ్రీకాంత్ "ఎన్ని తలచినా, ఏది అడిగినా జరిగేది నీ చిత్తమే ప్రభువా" అంటూ పాట పాడసాగాడు.

వినయ్ "చూడు ప్రవీణ్, మరీ అంత వర్రీ అవ్వకు, మమ్మల్ని వర్రీల్లో నెట్టకు. మిగిలిపోయిన కర్రీస్ పక్కరూమ్‌లో ఇచ్చేసి వచ్చి పండుకో. పొద్దున్నే చదువుకోవచ్చు. భవిష్యత్, ప్రణాళికలు అంటూ కంగారు పెట్టకు" అంటూ నిద్రకు ఉపక్రమించాడు.

రోజులు గడిచిపోయాయి. పరీక్షలు అయిపోయాయి. సెలువులు కాబట్టి ఒకరు యల్‌టి క్యాంప్‌కి, మరొకరు సియంటిసికి, మరొకరు యస్‌యంటిసికి వెళ్ళారు.

కాలేజ్ రీ ఓపెనింగ్‌కు ముందే రిజల్ట్స్ వచ్చాయి. ముగ్గురూ ముచ్చటగా మూడు సబ్జెక్ట్స్‌లో ఫెయిల్ అయ్యి బ్యాక్‌లాగ్ రూపంలో ఆస్తిగా సమకూర్చుకొన్నారు. ఇంట్లో తల్లిదండ్రులతో తన్నులు తినే పరిస్థితి వచ్చింది. సీనియర్ అడ్వయిజర్ రామకృష్ణ అన్న అయితే చదువులో సాక్ష్యం లేకుండా దేవుని పనెలా చేస్తారని ఫోన్‌లో గట్టిగానే తిట్టాడు.

సెలవులు అయిపోయిన తర్వాత ఎట్టకేలకు కాలేజ్‌కి వచ్చారు. ఆ రోజు వారిలో సంతోషమేలేదు. రామకృష్ణ అన్న కనీసం ఐదు సార్లు ఫోన్‌చేసి ఉంటాడు. అన్నతో మాట్లాడే ధైర్యంలేక ఫోన్‌తీయలేదు. ఆ రోజు చాలా కష్టంగా గడిచింది. అసలే ఫైనల్ ఇయర్‌కి వచ్చారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉంటాయి. తిరిగి చూసుకొంటే బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్స్. ఏం చేయాలో తెలీక అయోమయంలో ఉన్నారు.

ఇంతలో శ్రీకాంత్ "ఈ సంవత్సరం నేను కమిటీలో ఉండను, కమిటీలో ఉండడం వల్ల గత సంవత్సరం సరిగా చదవలేకపోయాం. అందుకే ఫెయిల్ అయ్యాము. మీరు కూడా ఆలోచించుకొండి" అంటూ ప్రవీణ్‌కి, వినయ్‌కి ఒక ఉచిత సలహా ఇచ్చాడు. వినయ్, ప్రవీణ్‌లు కూడా అలానే ఉన్నారు. ఈ సంభాషణ అప్పుడే విన్న సుధీర్ వచ్చి వారికి నచ్చ జెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు.

వెంటనే సుధీర్, "తమ్ముళ్ళూ మనం సాయి అన్న దగ్గరికి వెళదాం. అన్నతో మాట్లాడిన తర్వాత మీ ఇష్టం అని చెప్పాడు. అందరూ సరే అన్నారు. ఇంతలో ప్రవీణ్ 'యస్ఆర్‌హెచ్ ఐపిల్ కప్ కొట్టింది' అంటుండగానే సుధీర్ అన్న ప్రవీణ్ వైపు సీరియస్‌గా చూశాడు.

ఆ సాయంత్రం సుధీర్ ముగ్గుర్నీ సాయి అన్న ఇంటికి తీసుకెళ్ళాడు. సాయి అన్న సౌజన్య అక్క వారిని ప్రేమతో ఆహ్వానించి మంచి ఆతిథ్యం ఇచ్చారు.

సాయి అన్న, ఆ ముగ్గురి ఇంటి విషయాలు కనుక్కొని నెమ్మదిగా అసలు విషయం ఏంటని ఆరాతీశాడు. సాయి అన్నకు విషయాలు అర్థమయ్యాయి. వీళ్ళకు సరైన ప్రణాళిక లేదనిపించింది.

"తమ్ముళ్ళూ, జీవితంలో ఎదగడానికి క్రమమైన జీవితం, దానికి ప్రణాళిక ఎంతో అవసరం. ఎఫెసీ 5:15-16లో 'సమయాన్ని సద్వినియోగం చేసుకోమని' బైబిల్ చెబుతుంది. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి దేవుడిచ్చిన పద్ధతి 'ప్లానింగ్'. పద్ధతైన జీవితమంటే ప్రణాళికా బద్ధమైన జీవితమే. దేవుడిచ్చిన సమయాన్ని దుర్వినియోగం చేసుకోవడం అజ్ఞాని లక్షణం. ఏ రంగంలోనైనా ఉన్నతంగా ఎదిగిన వారందరూ చక్కని ప్రణాళికతో అడ్డంకులను అధిగమించి ముందుకు వెళ్ళిన వారే. ప్రణాళికలు కలిగి ఉండడం బైబిల్‌కి వ్యతిరేకం కాదు. యోసేపు ఐగుప్తును కరువు నుండి కాపాడడానికి ప్రణాళికలు వేశాడు. నెహెమ్యా యెరూషలేము గోడలు తిరిగి కట్టడానికి ప్రణాళికలు వేశాడు. పౌలు సువార్త దండయాత్రలకు ప్రణాళికలు వేశాడు.

ప్రణాళికలు వేయడంలో ఫెయిల్ అయితే ఫెయిల్ అవ్వడానికి ప్రణాళికలు వేసుకొన్నట్లే. ఖచ్చితంగా విశ్వాస విద్యార్థి ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని కట్టుకోవాల్సిందే.

మీ జీవితంలో మీకున్న ప్రణాళికలేంటి? మీలో ఎవరికైనా టైం టేబుల్ ఉందా? మీరు రోజు ఏ టైమ్‌లో చదువుతారు?" అంటూ కాస్త కఠినంగా అడిగేసరికి ముగ్గురూ తెల్ల మొహాలేసి, ఎవరికీ లేవని ఒప్పుకొన్నారు.

సాయి అన్న మాట్లాడుతూ, మీకంటూ ఒక టైమ్ టేబుల్ లేదు, రోజూ సబ్జెక్ట్ చదవరు, ఇలా అయితే ఎలా సక్సెస్ అవుతారు? జీవితంలో ఎలా ఎదుగుతారు?

అంతలో శ్రీకాంత్ "అంటే అన్న... దేవుడు సహాయం చేస్తాడు, దేవుని పనిచేస్తే మనపని ఆయన చేస్తాడు కదా!"

"ఇంకా నయం పరీక్షకూడా దేవుడే రాయాలి అనలేదు. దేవుని పేరు చెప్పి సోమరులుగా తయారవ్వకూడదు. దేవుడు సోమరులను అసలు పిలవడు, దీవించడు. దేవుడు కష్టపడమని చెబుతున్నాడు. మనం చేయాల్సిన పని మనం చేయాలి.

విద్యార్థులుగా మీ మొదటి ప్రాధాన్యత, దేవునితో సహవాసం తర్వాత చదువే. పరిచర్య తర్వాతే. చదువులేకుండా పరిచర్య చేస్తే దేవుని నామానికి మహిమ రాదు. కాబట్టి మీరు చదువులో రాణించాలి. అలాగే కొంత సమయం పరిచర్యకు కూడా కేటాయించాలి. చదివే సమయంలో, కాలేజ్ సమయంలో పరిచర్య గురించి ఆలోచించవద్దు" అని సాయి అన్న చెప్పాడు. వాళ్ళు వారి తప్పును తెలుసుకొన్నారు.

సాయి అన్న చిన్న ప్రార్థన చేసిన తర్వాత అందరూ కలిసి భోజనం చేసి మరలా వాళ్ళ రూమ్‌కి వచ్చారు. కమిటీ మెంబర్స్‌గా ఉండకూడదన్న నిర్ణయాన్ని మార్చుకున్నారు.

మరుసటి రోజు వారి జీవితాల్లో చాలా మార్పులు చోటుచేసుకొన్నాయి. ఎవరికి వాళ్ళు టైమ్ టేబుల్ వేసుకొని వారికెదురుగా గోడకు అంటించుకొన్నారు. చదువును, పరచర్యను చక్కగా సమన్వయం చేసుకొన్నారు. దేవుని మహా కృపను బట్టి సప్లిమెంటరీ పరీక్షల్లో ముగ్గురూ విజయం సాధించారు. తర్వాత క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ముగ్గురూ సెలెక్ట్ అయ్యారు.


ఆ సంవత్సరం పరచర్య అద్భుతంగా జరిగింది. కొత్త బైబిల్ స్టడీస్ ప్రారంభమయ్యాయి. యంపిసిలు క్రమంగా జరిగాయి. కొత్త విద్యార్థులు వీరి పరిచర్య వల్ల దేవునిలో స్థిరపడ్డారు. శ్రీకాంత్, ప్రవీణ్, వినయ్‌లు తమ ఇయులో, క్యాంపస్‌లో మంచి సాక్ష్యాన్ని వదిలి వెళ్ళారు.

**- యం. గాలెయ్య,** భీమవరం

పుస్తక పరిచయం

# బంగారం కంటే శ్రేష్ఠమైనది

## ఒకటి లేదా రెండు సంవత్సరాలలో బైబిల్ చదవడానికి ప్రణాళిక




లేఖనాలలో దేవుడు తనను తాను ప్రత్యక్ష పరచుకొన్నాడు. మనం ప్రతిరోజు బైబిల్‌ను చదివేకొద్దీ, మన ఆలోచనా విధానం, మన చిత్తం, మన భావోద్రేకాలలో క్రమంగా దేవుడు మార్పు తీసుకొస్తాడు. అప్పుడు మనం పూర్ణమనసుతో, పూర్ణశక్తితో, పూర్ణ హృదయంతో, పూర్ణ ఆత్మతో ఆయనను ప్రేమిస్తాము.

స్కాట్‌లాండ్ దేశానికి చెందిన రాబర్ట్ ముర్రే మెక్‌షేన్ (1813-1843) రూపొందించిన ఈ బైబిల్ పఠన ప్రణాళికను ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది క్రైస్తవులు ఉపయోగిస్తున్నారు. ఒక సంవత్సరంలో క్రొత్త నిబంధన, కీర్తనల గ్రంథాలను రెండు సార్లు, పాత నిబంధనలోని మిగిలిన గ్రంథాలను ఒకసారి చదవడానికి ఈ ప్రణాళిక మనకు సహాయం చేస్తుంది. చదవడానికి ఇది ఎక్కువగా ఉన్నట్లు మీరు భావిస్తే, నాలుగు వాక్య భాగాలకు బదులుగా రెండు వాక్య భాగాలు చదువుచూ, రెండు సంవత్సరాలలో ఈ ప్రణాళికను మీరు పూర్తి చేయవచ్చు. నాలుగు వాక్య భాగాలు చదివేవారు ఉదయం రెండు, సాయంత్రం రెండు చదవవచ్చు. రక్షణ ప్రణాళిక సంపూర్ణ చరిత్రను అర్థం చేసుకోవడానికి, రోజుకు ఒకటికన్నా ఎక్కువ భాగాలు చదవమని మెక్‌షేన్ క్రైస్తవులకు విజ్ఞప్తి చేసేవాడు.

లేఖనాలను వ్యక్తిగతంగా చదవమని, చిన్న చిన్న సమూహాలలో లేఖనాలను అధ్యయనం చేయమని, వారానికి ఒకసారి జరిగే సమావేశాలలో బోధించే వాక్యాన్ని వినమని, సౌవార్తీకరణలో వాక్యాన్ని ఉపయోగించమని మన రాష్ట్రంలో ఉన్న ఇయు, ఇజియఫ్ సభ్యులకు, స్టాఫ్‌కు విజ్ఞప్తి చేస్తున్నాము. మన విశ్వాసంపై, మన జీవితాలపై వాక్యానికి అత్యున్నత అధికారం ఉంది.

ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించిన అనుదిన క్రమశిక్షణ విషయంలో మనమందరం ఇబ్బంది పడుతూనే ఉన్నాము. క్రీస్తులో మీరు కొనసాగించే ఈ ప్రయాణంలో ఈ ప్రణాళిక మీకు సహాయం చేస్తుందని మేము నమ్ముచున్నాము.

“1950 దశాబ్దంలో డా.మార్టిన్ లాయిడ్ జోన్స్ ఈ మెక్‌షేన్ క్యాలెండర్‌ను నాకు పరిచయం చేశాడు. అప్పటి నుండి నేను దానిని ఉపయోగిస్తున్నాను. ఇందులో నాకు గొప్పగా అనిపించే విషయం ఏంటంటే లేఖనాలలోని నాలుగు “గొప్ప ప్రారంభాలతో ఇది ప్రారంభమవుతుంది”. ఆదికాండము (విశ్వం యొక్క ప్రారంభం), ఎజ్రా (బబులోను చెర తర్వాత ఇశ్రాయేలు దేశం యొక్క మరో నూతన ప్రారంభం), మత్తయి (క్రీస్తు పుట్టుక), అపోస్తలుల కార్యములు (క్రీస్తు శరీరమైన సంఘం యొక్క ప్రారంభం). ఈ నాలుగు విషయాలతో ఇది ప్రారంభమవుతుంది. బైబిల్‌లోని గొప్ప సత్యాలను అర్థం చేసుకోడానికి ఈ ప్రణాళిక సహాయపడినంతగా మరేదీ సహాయపడలేదు”. - జాన్ స్టాట్, యుకె

*క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి.*

ఈ పుస్తకం కావాల్సిన వారు నంబూరు ఆఫీస్‌లో లిటరేచర్ అసిస్టెంట్ బ్ర. పి. జగదీష్‌ను (94932 40435) సంప్రదించగలరు.

**- సాహిత్య విభాగం, యుఇయస్ఐ-ఏపి**




# ప్లానింగ్ ఎందుకు దండగ!

గదిలోకి ప్రవేశించిన వెంటనే చేతిలోని పుస్తకాలను కోపంగా విసిరికొట్టి కుర్చీలో కూలబడిపోయింది జాస్మిన్. ఆమెకు పిచ్చెక్కిపోతుంది. ఒకవైపు పరీక్షలు దగ్గరికొస్తున్నాయి. చదవాల్సింది ఇంకా చాలా ఉంది. మరోవైపు అక్క పెళ్ళి. పరీక్షల టైమ్‌లో డిస్టర్బెన్స్‌గా ఉంటుంది అని ఎంత మొత్తుకున్నా అమ్మానాన్నా ఒప్పుకోలేదు. "అబ్బాయి వాళ్ళకు ఇదే కన్వీనియంట్ డేట్ అట. మంచి సంబంధాన్ని వదులుకోలేం. అమ్మాయి తరపు వాళ్ళం, మనమే సర్దుకుపోవాలి" అంటూ అమ్మ ఓ పక్క, "నీకే పనులూ చెప్పం, నీ గదిలో కూర్చుని నువ్వు చదువుకో" అని నాన్న ఓ పక్క వాయించి, మొత్తానికి పెళ్ళి నిర్ణయించారు. తీరా చూస్తే ఆ మరుసటి రోజు నుంచే హడావుడి మొదలు. బంధువులు ఒక్కొక్కరే వచ్చి ఇంట్లోనే సెటిలవుతున్నారు. కాలేజీలో మాత్రం లెక్చరర్స్ చివర్లో మిగిలిన ఒకటీ అరా చాప్టర్స్ గబగబా లాగించేస్తున్నారు. బిటెక్ ఫైనల్ ఇయర్‌లో ఉన్న తను ఎగ్జామ్స్ సరిగ్గా రాయలేక ఫెయిలైతే... అమ్మో, ఇంకేమైనా ఉందా! తనకు తెలియకుండానే ఏడ్వడం ప్రారంభించింది జాస్మిన్.

ఒక్క జాస్మినే కాదు. ప్రారంభం నుంచి ఒక ప్రణాళికతో, క్రమ పద్ధతిలో ముందుకెళ్ళని ఎవరైనా చివర్న కూర్చుని ఇలా ఏడవాల్సిందే. కానీ ప్లానింగ్ అంటే చాలా మందికి గిట్టదు. ప్లాన్ చేసుకోవడం మంచిదే అని మనలో చాలామంది అంగీకరించినా దాన్ని ఆచరణలో పెట్టేవారు నూటికి ఒక్కరు మాత్రమే. అసలు మనకు ప్లానింగ్ అంటే ఎందుకు ఇష్టం ఉండదు! మనం ఏ విషయంలోనైనా ప్రణాళిక తయారుచేసుకోకుండా అడ్డుపడే విషయాలను కొన్నిటిని ఇప్పుడు పరిశీలిద్దాం.

### ప్రణాళిక పట్ల గౌరవం లేకపోవడం

ప్రణాళిక అంటే మనలో చాలామందికి చిన్న చూపు. ప్రణాళికలు పనిచేయవని, ఫలితాలనివ్వవని మనకు భలే నమ్మకం. అంతకుముందెప్పుడో ఒకసారి ప్రణాళిక వేసుకున్నా, దాని ప్రకారం నడవలేకపోయామనే నెపంతో, ఇక అసలు మనకు ప్లానింగ్ అనేదే గిట్టదు అంటూ కొంతమంది చేతులెత్తేస్తూ ఉంటారు. అలాంటి వారు ఇంకొకళ్ళు ఎవరైనా ఒక టైమ్ టేబుల్ వేసుకొని దాన్ని అనుసరించడానికి ప్రయత్నిస్తే వారిని చూసి ఎగతాళి చేస్తూ, వారిని కూడా నిరుత్సాహపరుస్తుంటారు.

ప్లానింగ్ అనేది దైవ స్వభావం అన్న విషయం మొదట మనం గుర్తించాలి. దేవుడు ప్రతిది ప్రణాళిక ప్రకారం చేస్తాడు, చేస్తున్నాడు. అంతేకాదు, మన జీవితాలు దేవుని దృష్టిలో ప్రాముఖ్యమైనవి అని మనం నమ్ముతాం కదా! అలాంటప్పుడు వాటిని ఒక పద్ధతీ ప్లానూ లేకుండా అస్తవ్యస్తంగా జీవించడం ఎంతమటుకు సబబు? మన జీవితాలు మనవి కావు. దేవునివి. వాటిని దేవుని కోరిక ప్రకారమే జీవించాలి. అంటే ప్రణాళికాబద్ధంగానే జీవించాలి. దేవునిని సంతోషపెట్టాలనుకునే ప్రతీ వ్యక్తీ ప్రణాళికాబద్ధమైన జీవితాన్ని ప్రేమిస్తాడు, జీవిస్తాడు. అంతే.

### జీవితం పట్ల బాధ్యత లేకపోవడం

పది లేక ఇరవై సంవత్సరాల తర్వాత మనం ఏమవుతామన్నది ప్రస్తుతం మనం తీసుకునే నిర్ణయాల మీద ఆధారపడి ఉంటుంది. 'ఎప్పుడో జరగబోయేదాని గురించి ఇప్పుడే ఆలోచించడం ఎందుకులే' అని పెదవి విరిచేవారు మనలో చాలామంది ఉంటారు. ఇంకో పది సంవత్సరాలకు మనం ఉంటామో, ఊడిపోతామో అని నిట్టూర్చేవారు కూడా లేకపోలేదు. నిజంగానే ఊడిపోతే ఏ బాధా లేదు. ఒకవేళ ఉంటే... అనేది ఆలోచించాలి. ఆశావహ దృక్పథంతో మన భావి జీవితాన్ని ప్లాన్ చేసుకోకపోతే తర్వాత తీరిగ్గా

కూర్చుని బాధపడాల్సింది మనమే. జీవితం పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించేవారు తమ జీవితంలోని ప్రతి విషయాన్ని తప్పకుండా ప్లాన్ చేసుకుంటారు. ప్రణాళిక లేని జీవితం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. మన జీవితం పట్ల నిర్లక్ష్యంగా వ్యహరించే హక్కు మనకు లేదు. ఇంతకుముందే అనుకున్నాం కదా, మన జీవితాలు మనవి కావని.

## చూస్తూ కూర్చునే బద్ధకం

జీవితం ముక్కలు ముక్కలుగా విరిగిపోతున్నా, మితిమీరిన బద్ధకం ఒక్కోసారి ఆ ముక్కల్ని కూడా పోగుచేసుకోనివ్వదు. జీవితంలో ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యేవారు ఏమీ సాధించలేరు. జీవితం దానంతట అదే ఎదుగుతూ పైకి వెళ్ళిపోలేదు. ఒక్కో రాయి మనమే పేర్చుకుంటూ పోవాలి. అలా చెయ్యాలంటే ప్రణాళిక అనేది తప్పనిసరి. ప్రణాళిక తయారు చేసుకోవడానికి గానీ, దాని ప్రకారం జీవించలేక పోవడానికి గానీ, బద్ధకం ఒక పెద్ద కారణం. పని చేయడానికి ఇష్టపడని వారికి ప్లాన్ చేసుకోవడం కూడా ఇష్టముండదు. 'ఆ, ఏ ముందిలే, జరగాల్సింది జరుగుతుంది. మనం ప్లాన్ చేసుకోనంత మాత్రాన జరక్కుండా ఆగుతుందా?' అని గోడకు జారబడి కూర్చోవడం వల్ల బద్ధకంలోంచి నెమ్మదిగా నిరాశా వాదంలోకి కూరుకుపోయే అవకాశం కూడా లేకపోలేదు.

## టైమ్ విలువ తెలీయకపోవడం

వృథాగా గడిచిపోయిన కాలాన్ని గురించి మనమిక ఏమీ చెయ్యలేం. ఎవరి కోసమూ ఆగకుండా కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది. సమయాన్ని పోనివ్వకుండా సద్వినియోగం చేసుకోవాలని బైబిలు ఆజ్ఞాపిస్తుంది. 'అయ్యో! ఏమీ సాధించకుండానే సంవత్సరాలన్నీ గడచిపోయాయే' అని బాధపడితే లాభం ఉండదు. కాలం విలువ తెలిసిన వాళ్ళు ప్రతి నిమిషాన్ని, ప్రతి దినాన్ని ప్లాన్ చేసుకుంటారు. 'బిటెక్ నాలుగేళ్ళే చదవాలని ఏముంది' అనుకుంటూ వాయిదాల పద్ధతిలో సబ్జెక్టులు పాసవుతూ సంవత్సరాల తరబడి ఒకే కోర్సు చేసే వాళ్ళు ఎంత సమయాన్ని వృథా చేస్తున్నారో ఆలోచిస్తే గుండెల్లో కలుక్కుమనక మానదు. రోజువారీ ప్రణాళిక ప్రకారం ఒక్కోపనీ చేసుకుంటూ వెళ్తేనే మన సంవత్సరాలు ప్రయోజనకరంగా ఉంటాయి.

విద్యా సంవత్సరంలో ఒక్క నిమిషాన్ని కూడా వృథా చెయ్యకుండా ప్రారంభంలోనే ఒక పకడ్బందీ ప్రణాళికను తయారు చేసుకొని ముందుకు వెళ్తేనే విద్యార్థులుగానీ, లెక్చరర్స్‌గానీ, పరిచర్య చేసే గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ వర్కర్స్‌గానీ సంవత్సరానికి ఏదైనా సాధించగలరు.


## శాశ్వతమైన గోల్ లేకపోవడం




భవిష్యత్తుకు సంబంధించి ఖచ్చితమైన లక్ష్యం ఉన్నప్పుడే మన ప్రస్తుతాన్ని అర్థవంతంగా ప్లాన్ చేసుకునే వీలవుతుంది. విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ని మొదటి నుంచే ప్లాన్ చేసుకోవడానికి మోటివేషన్ అనేది వారికున్న గోల్ నుంచే వస్తుంది. ఎలాగోలా పరీక్షల్లో పాసైతే చాలు అనుకునేవారు సంవత్సరాన్ని ప్లాన్ చేసుకోలేరు. గోల్ లేనప్పుడు ఇక ప్లాన్ దేనికోసం? మనం ఒక పిక్నిక్‌కి వెళ్ళాలి అనుకున్నప్పుడు దానికి అనుగుణంగా అన్నీ ప్లాన్ చేసుకుంటాం. పిక్నిక్‌కి వెళ్ళాలి అనే గోల్ మన ప్లానింగ్‌కి ఆధారంగానూ, మోటివేషన్‌గానూ నిలుస్తుంది. గోల్ లేకపోతే ప్లానింగ్ కూడా ఉండదు. మన జీవితానికి మనం ఏర్పరచుకొన్న గోల్ అనుదిన కార్యక్రమాన్ని ప్లాన్ చేసుకోవడానికి సహాయపడుతుంది. అదే మన దైనందిన జీవితాన్ని ఉత్సాహభరితంగా చేస్తుంది.

"గుడ్ థింగ్స్ హ్యాపెన్ ఓన్లీ వెన్ దే ఆర్ ప్లాన్డ్. బ్యాడ్ థింగ్స్ హాపెన్ ఆన్ దేర్ ఓన్" అని ఒక ఇంగ్లీష్ సామెత ఉంది. మనం ప్రణాళిక ప్రకారం చేసినప్పుడే మనం అనుకున్న పనులు జరుగుతాయి. లేకుంటే అన్నీ మనకు వ్యతిరేకమైన పనులే జరిగే అవకాశం ఉంది. ప్లాన్ చేసుకోకుండా 'ఆ సమయానికి అన్నీ మనకు అనుకూలంగానే జరుగుతాయిలే' అనుకునే వారికి నిరాశే మిగులుతుంది. మన జీవితాలను ప్లాన్ చేసుకోకుండా పైన చెప్పినవాటిలో ఏది అడ్డుపడుతుందో గమనించి దాన్నుంచి బయట పడదాం. మన దేవుడు ప్లానింగ్ కలిగిన దేవుడు. కాబట్టి ఆయన ప్రజలంగా మనం కూడా ఒక ప్లాన్ కలిగి, మన జీవితాలను అర్థవంతంగా, ఫలవంతంగా జీవిద్దాం.

– విజె డెస్క్



# విలియం కేరి జీవితంలో ఒక రోజు...

**కలకత్తాలో ఉన్నప్పుడు రాసుకొన్న డైరీ నుండి...**

విలియం కేరీ ఎవరు? అంటే ... వృక్ష శాస్త్రజ్ఞుడు, సెరంపూర్ మిషన్ ప్రెస్ వద్ద ఆవిరి ఇంజన్‌ను ప్రవేశపెట్టిన మొదటి ఇంగ్లీష్ వాడు, సేవింగ్ బ్యాంక్స్ ప్రవేశపెట్టిన వాడు, కుష్టురోగులకు చికిత్స చేయాలనే ప్రచారానికి నాయకత్వం వహించినవాడు, ముద్రణా సాంకేతిక పరిజ్ఞానానికి పితామహుడు, మొట్టమొదటగా ముద్రించబడిన వార్తా పత్రికను స్థాపించిన క్రైస్తవ మిషనరీ, అగ్రి హార్టీకల్చర్ సొసైటీని స్థాపించినవాడు, తర్జుమాదారుడు, ఫోర్ట్ విలియం కాలేజీలో బెంగాలీ, సంస్కృతం, మరాఠీ భాషలకు ప్రొఫెసర్, ఈ ఉపఖండంలో ఖగోళశాస్త్రాన్ని పరిచయం చేసినవాడు, లెండింగ్ లైబ్రరీలకు మార్గదర్శి, అటవీ శాస్త్రంపై వ్యాసాలు రచించిన ప్రథముడు, సామాజిక దురాచారాల నిర్మూలనకు కంకణం కట్టుకొన్నవాడు, ఒక మిషనరీ, తత్వవేత్త, 19,20 శతాబ్దాల భారత పునరుద్ధరణకు పితామహుడు... ఇన్ని పనులు ఎలా చేయగలిగాడు అంటే దేవుడిచ్చిన సమయాన్ని సరిగా ఉపయోగించుకొనేవాడు గనుకనే..

ఈ ఉదయం నేను 5:45 గం॥లకు నిద్ర లేచాను. హెబ్రీ భాషలోని బైబిల్‌లో ఒక అధ్యాయం చదివాను. వ్యక్తిగతంగా దేవునితో సంభాషిస్తూ 7 గం॥ వరకు గడిపాను. తరువాత నా బెంగాలీ సేవకులతో కలిసి కుటుంబ ప్రార్థనలో గడిపాను. వారు టీ ని సిద్ధపరుస్తున్న సమయంలో, నేను నిద్ర మేల్కొన్నప్పటి నుండి నా కొరకు ఎదురు చూస్తున్న మున్షి భాషోపాధ్యాయునితో కలసి పర్షియన్ భాషలోని బైబిల్‌ను కొంత చదివాను. అలాగే, టిఫిన్ చేయక ముందు హిందూస్తానీ భాషలో కొంత లేఖన భాగాన్ని చదివాను. టిఫిన్ చేసిన వెంటనే నాకోసం ఎదురు చూస్తున్న హిందూ వేదాంత పండితునితో కలసి రామాయణాన్ని సంస్కృతం నుండి ఇంగ్లీషులోనికి అనువదించే పనిని ప్రారంభించాను. ఈ అనువాదాన్ని పది గం॥ల వరకు చేశాను. పది గం॥లకు సిద్ధపడి కాలేజీకి వెళ్ళాను. మధ్యాహ్నం 2 గం॥ల వరకు అక్కడ నా బాధ్యతలను నిర్వర్తించాను. ఆ తర్వాత ఇంటికి వచ్చి, బెంగాలీ భాషలోనికి అనువదింపబడిన యిర్మీయా గ్రంథపు ప్రూఫ్ షీట్లను పరిశీలించిన తర్వాత భోజనం చేశాను. నేను కలకత్తాలో ఉన్నప్పుడెల్లా దగ్గరలోని మిస్టర్ రోల్ట్స్ అను హోటల్‌లో భోజనం చేసేవాడిని. భోజనం తర్వాత కాలేజీ ప్రధాన పండితుని సహాయంతో మత్తయి సువార్త 8వ అధ్యాయంలోని చాలా భాగాన్ని సంస్కృతంలోకి అనువదించాను. ఈ ప్రక్రియ సాయంత్రం ఆరు గం॥ల వరకు జరిగింది. ఆ తర్వాత తెలింగా (బహుశా తెలుగు అయివుండవచ్చు) పండితుని సహాయంతో ఆ భాషను నేర్చుకోవడం ప్రారంభించాను. ఏడు గం॥లకు నా ఆలోచనలన్నీ క్రోడీకరించి ఒక ప్రసంగాన్ని తయారు చేసుకున్నాను. ఏడున్నరకు ప్రసంగం మొదలు పెట్టాను. సుమారు 40 మంది ప్రజలు కూడుకొన్నారు. సుద్ధర్ దివాని అదాలత్‌కు చెందిన ఫౌస్ని న్యాయమూర్తులలో ఒకడు వారిలో ఉన్నాడు. మేము నూతనంగా నిర్మించబోతున్న చర్చ్ కొరకు 500 రూపాయలు విరాళాన్ని అతని నుండి స్వీకరించాను. అతను గొప్ప స్నేహశీలి. బోధించడం అయిపోయింది. ప్రార్థనకు వచ్చినవారు 9 గం॥లకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత యెహెజ్కేలు గ్రంథంలోని 11 వ అధ్యాయాన్ని బెంగాలీ భాషలోకి రాత్రి 11 గం॥ల వరకు అనువదించాను. ఆ తర్వాత మీ కోసం నా దిన చర్య విషయాలన్నీ రాద్దామని కూర్చున్నాను....

*మరి మన దిన చర్య ఎలా ఉంది?*

(ఎఫెసీ 5:15-16).

**దేవుని యొద్ద నుండి గొప్పవాటిని పొందుటకు నిరీక్షించు, ఆయన కొరకు గొప్పవాటిని చేయడానికి ప్రయత్నించు - విలియం కేరి**

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**
**Date of Printing: 25-05-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**



# బంగారు కలలు

ఇప్పుడు ఎక్కడ ఉన్నావో
తర్వాత ఎక్కడ ఉండాలో
నిర్ణయం నీచేతుల్లోనే....
భావి జీవితాన్ని
బంగారు రంగుల్లో చూసుకోవాలంటే
ఏం చేయాలో
ఎలా చేయాలో
ప్రశ్నలు వేసుకో
ప్రణాళికలు రాసుకో

అస్పష్ట ఆలోచనలు
అసమర్థ ఆచరణలు
వ్యర్థమైన కార్యాలు
వృథా కాలాలు
అన్నిటికీ చెక్ పెట్టాలంటే
నియమం ప్రకారం నడువు!
బద్ధకాన్ని వదిలించుకొని
దిద్దుబాటు దిశలో వెళ్ళాలంటే
పద్ధతి ప్రకారం పరుగెత్తు!

క్లాసుల్లో టాపర్‌గా
ఉద్యోగంలో ఉన్నతంగా
సేవలో ఉత్తమంగా
నిన్నుంచాలని
అందరిలో హెచ్చించాలని
నిన్ను సృష్టించిన దేవుని ఆశ
ఆకాశమంత ఎత్తులో ఉన్న
ఆయన తలంపులు
మేలుకే కాని కీడుకు కాదు!

చక్కని ఫలాలనిచ్చే
పచ్చని ఒలీవ చెట్టు
సారాన్ని గ్రహించినట్టు
ఆయన రాజ్యాన్ని నీతిని
ఆరంభంలోనే వెదుకు!
భూమి పుట్టకముందే
నీ పట్ల ఉన్న
ప్రభువు చిత్తం తెలుసుకొని
రాబోయే రోజుల్ని కలలు కను!
రాజాధిరాజు బిడ్డగా
వాటిని సాధించి చూపించు!

– **గొంగటి మేరిజాయ్**, ఆదోని

UESI PUBLICATION TRUST - ANDHRA PRADESH BRANCH

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 0 07. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508